

# విశ్వసూక్తము

## విశ్వశాంతి సమైక్యతా శంఖారావం

**సంపుటి : 10** **మే - 2019** **సంచిక : 3**

వ్యవస్థాపక సంపాదకులు : **శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్**

ప్రధాన సంపాదకులు : **శ్రీ కె.వి.ఆర్. సూర్యారావు**

గౌరవ సంపాదకులు : **శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు, శ్రీ యమ్.వి. ఆర్. శాస్త్రి**

సంపాదక వర్గము : **శ్రీ కె. వెంకట శివయ్య, శ్రీ పి.ఆర్. రావు, శ్రీ కె.కె. గుప్త,**

**శ్రీ పి.వి. రమణరావు,** ఆంధ్రభూమి ప్రతినిధి

**ఈ సంచికలో ...**

సంపాదకీయం 6

21-4-2019 నాడు శ్రీ కె.కె.గుప్తా గారి ఇంటిలో స్వామి దివ్యసందేశం 9

వేదాంతకథాస్రవంతి 13

గురు సూక్తము 14

శ్రీ వాసుదేవానంద సరస్వతీ (టెంబే స్వామి) సద్గురు చరిత్ర 15

స్త్రీ సూక్తము 27

విశ్వహృదయార్చన 34

ఆత్మబంధువు 42

గీతమంజరి 50

సంవత్సర చందా : రూ. 100/- మాసపత్రిక వెల : రూ. 10/-

Edited, Printed & Published by Sri K.V.R. Surya Rao on behalf
Viswamanava Samaikyata Samsat, Viswamandiram,
3rd Line, Krishnanagar, Guntur - 522 006. (A.P.) INDIA
from G - 2, Orchids, D.D.Colony, Hyderabad - 500 007
and Printed at Sri Lakshmi Graphics, 1-8-436, St No. 10, Chikkadpally,
Hyderabad-500 020. Ph : 040-6666 2976

9-5-2019న

**మా వివాహ వార్షికోత్సవము**

21-5-2019న

**శ్రీమతి కనకదుర్గాభవాని జన్మదినం**

30-5-2019న

మా కుమారుడు చి॥వికాస్ చి॥ల॥సౌ॥దివ్యల

**వివాహ వార్షికోత్సవము**

సందర్భంగా

**భగవాన్ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ వారి**

దివ్య ఆశీస్సులను అర్థిస్తూ

వారి పాదపద్మాలకు

వినమ్ర భక్తిపూర్ణ హృదయాలతో

నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాము

**మేకా వెంకటేశ్వర రావు, చి॥ల॥సౌ॥కనకదుర్గా భవాని,**

**కుమారుడు చి॥వికాస్, కోడలు చి॥ల॥సౌ॥దివ్య**

**నా జన్మదిన సందర్భంగా**

**భగవాన్**

**శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ వారి**

దివ్యాశీస్సులు అర్థిస్తూ వారి చరణ కమలాలకు
వినమ్ర భక్తి పూర్ణ హృదయాలతో
నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాము.

**శ్రీధర్**
(మే-9, 2019)

తల్లి : **వంకదార సుజాత**
తండ్రి : **వంకదార గోపాలకృష్ణమూర్తి**
నంద్యాల, కర్నూలు జిల్లా

# జ్ఞానసూక్తమ్



**యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః ।**
**సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥**

భగవద్గీత అధ్యాయం 5 ॥ శ్లోకం ॥ 7

భక్తితో కూడిన కర్మ మార్గం విశిష్టమైనదని సూచించిన శ్రీకృష్ణుడు ఆ మార్గాన్ని ఆచరించే వ్యక్తి పరిశుద్ధమైన ఆత్మ, ఆత్మ నిగ్రహం కలిగి ఇంద్రియాలను తన అధీనంలో ఉంచుకొనడం ద్వారా సర్వజీవులను అభిమానిస్తూ వారి అభిమానాన్ని పొందుతాడని తెలియజేస్తాడు. వ్రతాలు, నోములు చెట్టుయొక్క కొమ్మలు వంటివి మాత్రమే. అవి చెట్టునుండి భిన్నమైనటువంటివి కావు. అదే విధంగా ప్రతి జీవి పరమాత్మకంటే వేరుకాదు. చెట్టు మొదట్లో పోసిన నీరు చెట్టు యొక్క ఆకులకు కొమ్మలకు అందుతుంది. భగవంతునియందు భక్తితో అచరించే ప్రతి కర్మ భగవంతునికి అందుతుంది. కడుపునిండా తినే ఆహారం దేహమంతటికి అందుతుంది. అప్రయత్నంగా శక్తిని మనిషి పొందుతాడు. పరమాత్మయందు భక్తి భావంతో కర్మాచరణ చేయు వ్యక్తి అందరి ప్రేమను పొందుతూ పరిశుద్ధమైన అంతరంగస్థితిని కలిగియుంటాడు.

## సంపాదకీయం

# యతి

**– పి.వి. రమణరావు**

దైవాంశ సంభూతులు హిమాలయాల్లో నేటికీ సంచరిస్తూనే ఉన్నారా? అంటే ఔను! అని చెప్పుకోవాల్సి వస్తోంది. భారతదేశంలో హిమాలయ పర్వతాలకు మహత్తర చరిత్ర ఉంది. సత్యయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం నుండి నేటి కలియుగం వరకు హిమాలయాలకు ఉన్న ప్రాధాన్యత అలాగే కొనసాగుతోంది. ఈ పర్వతాలకు ఉన్న పవిత్రతను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

హిమాలయాల్లో “యతి” భారీ పాదముద్రలు కనిపిస్తున్నాయని దాదాపు రెండు శతాబ్దాలుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ భారీ పాదముద్రలు ఎవరివి? అన్న అంశంపై ప్రపంచవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో చర్చ జరుగుతూనే ఉంది. 18 మందితో కూడిన భారత సైనికుల పర్వతారోహణ బృందం 2019 ఏప్రిల్‌లో నేపాల్‌లోని మకాలు శిబిరం వద్ద స్పష్టమైన భారీ పాదముద్రలను చూసింది. వెంటనే సైనికుల బృందం చూసిన ఈ పాదముద్రలపై మళ్లీ చర్చ జరుగుతోంది. చరిత్రలో వెనుకకు వెళ్లి పరిశీలిస్తే ... హిమాలయాల్లో భారీ శరీరం కలిగిన వారి పాదముద్రలను ఎవరో ఒకరు చూస్తూనే ఉన్నారు. 1899 నుండి అంతకు ముందు కూడా అనేకమంది భారీపాదముద్రలను చూశామంటూ చెబుతూనే ఉన్నారు. ఇంతకూ ఆ భారీ పాదముద్రలు ఎవరివి అన్నది అంతుచిక్కని ప్రశ్నగానే మిగులుతోంది. రామాయణం, భారతం తదితర పురాణాలను పరిశీలిస్తే మన పూర్వీకుల్లో చిరంజీవులుగా జీవించాలంటూ దేవతల నుండి ఆశీస్సులు పొందిన వారు ఏడుగురు ఉన్నారు.

**“అశ్వత్థామ బలిర్వ్యాసో**
**హనుమాన్మ్చ విభీషణః**
**కృపః పరశురామశ్చ**
**సప్తైతే చిరజీవనః”**

అన్న శ్లోకం మనం గుర్తుకు తెచ్చుకుంటే వాస్తవాలు ఏమిటో అర్థమవుతాయి.

అశ్వత్థామ, బలి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యులు, పరశురాముడు అనే ఏడుగురు చిరంజీవులు అన్నది ఈ శ్లోకం అర్థం. వీరిలో అందరూ భారీశరీరం ఉన్నవారే. త్రేతాయుగంలో రామాయణ కాలంలో కీలక భూమిక వహించిన హనుమంతుడు, ద్వాపరయుగంలో మహాభారత యుద్ధంలో కూడా పరోక్షంగా కీలకభూమిక నిర్వహించారు.

అర్జునుడు కొంతమంది మహానుభావులతో పాటు దేశపర్యటన చేస్తూ రామేశ్వరం వద్దకు వచ్చాడట. రాముడు ప్రతిష్టించిన శివలింగాన్ని పూజించాడు. రామసేతును పరిశీలించి, వానరుల సాయంతో సేతును రాముడు ఎందుకు నిర్మించాడు? తన వద్ద ఉండే బాణాలతో సేతును నిర్మించవచ్చు కదా? అని మహానుభావులను అడిగాడట. ఎవరూ సమాధానం చెప్పలేదు. అక్కడే ఉన్న హనుమంతుడు దీనికి జవాబు చెబుతూ, సుగ్రీవుడు, అంగదుడు, నీల తదితర భారీకాయులైన వానరుల బరువును బాణాలు మోయలేవని, అందుకే రాళ్లతో సేతువును నిర్మించాడని చెప్పాడు. ఆ తర్వాత మరొక పర్యాయం పర్వతాల వద్ద భీముడికి హనుమంతుడు తారసపడి మాట్లాడారు. తొలుత హనుమంతుడి, ఆయన శక్తిని గుర్తించక భీముడు మాట్లాడినా, హనుమంతుడు తన గురించి తెలియచేస్తాడు. అర్జునుడితో పాటు భీముడికి కూడా హనుమంతుడు హామీ ఇస్తూ మహాభారత యుద్ధంలో మీకు అండగా ఉంటానంటాడు. కురుక్షేత్ర యుద్ధం సందర్భంగా అర్జునుడి రథానికి ఉన్న జెండాపై హనుమంతుడి ఉండి, యుద్ధంలో కర్ణుడు తదితరులు వేసే ఆయుధాల వల్ల అర్జునుడి రథాన్ని రక్షించాడు. యుద్ధం పూర్తయిన తర్వాత హనుమంతుడు వెళ్లిపోగానే అర్జునుడి రథం అగ్నికి ఆహుతి అయిందట. 'హనుమంతుడి వల్లనే యుద్ధసమయంలో నీ రథానికి ఎలాంటి విపత్తు కలగలేద'ని శ్రీకృష్ణపరమాత్మ అర్జునుడితో చెప్పారు. ధర్మాన్ని కాపాడేందుకు హనుమంతుడు చిరంజీవిగా సంచరిస్తున్నారని భావించవచ్చు.

ధర్మాన్ని కాపాడేందుకు, మానవాళిని రక్షించేందుకు అనేకమంది మహానుభావులు నేటికీ హిమాలయాల్లో సంచరిస్తున్నారు. ప్రతి పౌర్ణిమ అర్ధరాత్రి సమావేశమై చర్చించి నిర్ణయాలు తీసుకుంటూనే ఉన్నారని భగవాన్ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ తరచూ మనకు చెబుతూనే ఉన్నారు.

# 21-4-2019 నాడు శ్రీ కె.కె.గుప్తా గారి ఇంటిలో స్వామి దివ్యసందేశం

పూలగుత్తు లెన్ని పూజలో నుంచినా
పులకరించబోడు పుచ్చుకోడు
హృదయకమలమొసగ సదయుడై గ్రహియించు
శాంతిప్రేమదాయి సత్యసాయి

ప్రేమమూర్తులారా,

పరమ పవిత్రమైన పర్వదినం ఈరోజు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ సమాజమే కాకుండా సత్యసాయి సామ్రాజ్యంలో ఉన్నటువంటి ప్రతి వ్యక్తి కూడా ఈనాడు ఈస్టర్ సండేగా జరుపుకుంటున్నారు. గుడ్ ఫ్రైడే నాడు శిలువ వేయబడి, శుక్రవారం, ఆదివారం నాడు ఆ శరీరంలోని దివ్యశక్తి ఏదయితే వుందో ఆ శక్తి పైకి లేచివచ్చి జాగృతమై శక్తివంతమై ఎవరైతే నమ్మకం విశ్వాసంతో, కారుణ్యంతో సమాజసేవ చేస్తారో వారికి ఆశీస్సులు ఇస్తుంటాను అని క్రైస్తు చెప్పిన రోజు. షిరిడి సాయినాథుని శక్తి కూడా మూడురోజుల తరవాత అలాగే తిరిగివచ్చింది.

ఇంతకు ముందు గుప్తా మాట్లాడుతూ నా నోట మాట రావడంలేదు అన్నాడు. భగవంతుడుకి కూడా నోట మాట రావడం లేదు, ఏమిటి ఇదంతా? మామూలుగా బర్త్‌డే నాడు గంట మాటలాడతాను, కాని ఈసారి పది నిమిషాలు మాత్రమే మాట్లాడతాను. ఎందుకో కూడా చెప్పాను. సత్యసాయి కూడా చెప్పి చెప్పి నోరు నొచ్చుకుందే కాని నేను చెప్పిన విధంగా నడచుకునేవారు ఎవరైనా ఉన్నారా అని లెక్క పెడుతుంటే వేళ్ళమీద కూడా లేరు, నలుగురో ఐదుగురో ఉన్నారు అని అన్నాడు. ఇది ఆలోచించవలసిన విషయం. సత్యసాయిని ప్రేమిస్తున్నాం, అభిమానిస్తున్నాం, పూజిస్తున్నాం, పాటలు పాడుతున్నాం. ఇవి అన్ని కావాలి మనలనే కాదు ఇతరులని ప్రేమించడానికి, మనసుకు ప్రశాంతత కలగజేయడానికి. కాని నిత్యజీవితంలో ఆచరణలో పెట్టాలి. అది చాలా ముఖ్యం.

సత్యసాయి అవతారంయొక్క ప్రాముఖ్యత చాలా ఉంది. సత్య అంటే

నిజమైనది, 'స' అంటే సత్యమైన 'ఆయి' అంటే తల్లి, 'బాబా' అంటే 'తండ్రి'. విశ్వానికి తల్లితండ్రి అయిన ప్రకృతి పురుషులయొక్క సమైక్య శ్రీశక్తి స్వరూపము ప్రేమపూర్వకంగా, కారుణ్యపూర్వకంగా సత్యసాయి ఆకారంలో వచ్చిందని తెలియజేయడానికి అలా పేరు పెట్టుకున్నాడు. ఆయన లక్ష్యం ఏమిటి, ధ్యేయం ఏమిటి? ఆయన ఏమి కోరుకున్నాడు? ఆ ఆకారంలో వచ్చి ఏమి చేయాలనుకున్నాడు? తను ఉన్నటువంటి నివాసానికి ప్రశాంతినిలయం అని పేరు పెట్టుకున్నాడు. మందిరానికి ప్రశాంతిమందిరం అని పేరు పెట్టుకున్నాడు. అంటే ఆయన ప్రశాంతిని కోరుకున్నాడు. నీ మనసుకి ప్రశాంతి కలగజేయడానికి, నీ గృహానికి ప్రశాంతి కలగజేయడానికి, రాష్ట్రానికి, దేశానికి, ప్రపంచానికి, విశ్వానికి శాంతి కలగజేయడానికి ఈ ఆకారంలో వచ్చాను, వచ్చి ఏమి చేస్తున్నాను, ఏమి చేస్తే ముందు మానసిక ప్రశాంతత వస్తుందో, తరవాత గృహంలో ప్రశాంతత వస్తుందో అది ఆచరణలో పెట్టి నా జీవితమే నా సందేశం అని ధైర్యంగా తల ఎత్తుకుని గర్వంగా చెప్పిన వ్యక్తి సత్యసాయి భగవానుడు ఒక్కడే. వేరెవరూ లేరు. ఉన్నా వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు. అది మనం ఆచరించాలి.

ఏమి జరుగతోంది ఇప్పుడు శ్రీలంకలో? ఇప్పటిదాకా లెక్కపెడితే దాదాపు 150 మంది చనిపోయారు, ఇంకా ఎంతమంది చనిపోయివుంటారో, ఎంతమంది గాయపడివుంటారో తెలియదు దేవుడు పేరుతో. ప్రార్థన చేసుకునే చర్చిలో తను మానవబాంబులా వెళ్ళి తనను తాను సంహరించుకోవడమే కాకుండా ఇతరులను ఎందరినోకూడా నాశనం చేసేటటువంటి ఆ పద్ధతి ఏమిటి అది? దీని గురించి ఆలోచించాలి. రాజకీయం చేయడం కాదు. రాష్ట్రంలో గాని, దేశంలో గాని, ప్రపంచంలో గాని రాజకీయం కాదు కావలసింది, శాంతి ఎట్లా ఇస్తాం, ప్రశాంతి ఎలా తీసకువస్తాం అని ఆలోచించండి. అందుకు మీ రాజకీయ పద్ధతిని, రాజకీయ విజ్ఞతను ఉపయోగించండి. అంతే కాని అశాంతిమయం చేయకండి. ఎవరు అడిగినా మాకు ఏమి ఇవ్వక్కరలేదు మానుంచి పన్నులు వసూలు చేయకండి అని వ్యాపారస్తులు కోరుకుంటారు. నేను ఏమి కోరుకుంటానో తెలుసా? సత్యసాయి ఏం కోరుకుంటాడో తెలుసా?

యోగులు, సిద్ధపురుషులు ఏమి కోరుకుంటున్నారో తెలుసా? ముందు మాకు భద్రత నివ్వండి, ప్రశాంతి కలగజేయండి అని. శాంతిభద్రతలు చాలా ముఖ్యం. అవి ఉంటే ఎవరంతట వారే బాగుపడతారు, వాళ్ళంతట వాళ్ళే బాగు చేసుకుంటారు.

భగవంతుడు మనలను అడుగుతున్నాడు 'నీకు శరీరం ఇచ్చాను, జీవితం ఇచ్చాను, మనసు ఇచ్చాను జ్ఞానం ఇచ్చాను, శరీరంలో అద్భుతమైన అవయవాలను ఇచ్చాను ఉపయోగించుకోమన్నాను, కంప్యూటరు లాంటి బ్రెయిన్ ఇచ్చాను అని. మన శరీరంలోని అవయవాల గురించి ఆలోచిస్తే ఆశ్చర్య పోతాము. మానవశరీరం అన్నిటికన్న అత్యద్భుతమైనది. మనసు మనకు దేవుడిచ్చిన వరం. శరీరం, జీవితం దేవుడిచ్చిన వరం. మనం వాటిని సరిగ్గా ఉపయోగించు కుంటున్నామా అని ఎవరికి వారు ఆలోచించుకోవాలి. డాక్టరు దగ్గరకు మందు గురించి వెళ్ళవలసిన అవసరం లేకుండా నీ శరీరాన్ని వజ్రాయుధం చేసుకోవచ్చు. నీ శరీరంలోని ప్రతి ఒక్క అవయవం ఆయుధమే. మీ అమ్మాయి కరాటే నేర్చుకుందనుకోండి కొన్ని సంవత్సరాలు. ఆమె చేతికి ఏదైనా ఇవ్వాలనుకుంటే భయం ఎక్కడ పగలగొడుతుందేమోనని. చెక్క ముక్కలను సునాయాసంగా పగలగొటుతుంది. ఆ శక్తి ఎట్లా ఉంటుందంటే వికాసం పొందుతుంది. Practice makes man perfect. Are we waiting to make mind powerful and peaceful? There is a process, there is a way to make mind powerful and peaceful. మనసు పూర్తిగా శక్తివంతంగా ఉంటేనే ఏదైనా చేయవచ్చు. మనసుతోటే సైంటిష్టులు అనేకం కనుక్కున్నారు. మనసుతోటే సెల్ ఫోను కనుక్కున్నారు. కంప్యూటరుని సెల్‌ఫోనులోకి తెచ్చారు. సెల్ ఫోను లేకుండా అరచేతిని కంప్యూటరుగా చూపించే రోజు కూడా వస్తుంది. మనసుని మనం ఉపయోగించు కునే విధానంబట్టి ఉంటుంది. చెడగొట్టచ్చు, మంచిచేయచ్చు. కత్తితో పొడవచ్చు, ప్రాణాలు రక్షించవచ్చు. కత్తిది కాదు లోపం. హంతకుడైతే ప్రాణాలు తీస్తాడు, సర్జను ప్రాణాలు పోస్తాడు. భగవంతుడు చాలా బాధపడుతున్నాడు. ఇందుకా వీళ్ళని వెంబడించింది. సమస్తమైనవాటిని ఇచ్చాను, కృతజ్ఞత చెప్పకపోయినా

పంచభూతాలనిచ్చాను. హైదరాబాదులో స్థలం కొంటే రిజిస్ట్రేషనుకు డబ్బు కట్టాలి. ఇల్లు కట్టుకోవడానికి ప్లాను అనుమతికి డబ్బు కట్టాలి. ఇల్ల కట్టాక అంతా లెక్కలు కట్టి ఆస్తి పన్ను కట్టాలి. తరవాత ఆదాయపుపన్ను కడుతున్నాము. ఇన్ని పన్నులు కడుతున్నామే మరి ఇన్నింటిని ఇచ్చిన భగవంతుడికి ఏం కడుతున్నాం ఒకసారి ఆలోచించండి.

సత్యసాయి కోరింది ప్రశాంతి. కాబట్టి ఇతరుల మనసులను బాగుచేయ లేకపోతే  పోని కాని పాడు చేయకండి. మీకు ఒక ఆనందకరమైన విషయం చెప్తాను. ఒకసారి నా దగ్గరకు ఒక భార్యాభర్త వచ్చారు. నమస్కారం చేసుకుని మీ ఋణం తీర్చుకోలేము స్వామీ అన్నారు. పరవాలేదు అట్టేపెట్టుకో అసలు నేను ఏంచేసాను అన్నాను. మా అబ్బాయి, కోడలు అమెరికాలో ఉంటారు. ఈ మధ్య మేము అమెరికా వెళ్ళాము. మా కోడలు మమ్మలని ఎంతో అభిమానంగా చూసింది అలా అంతకు ముందు ఎప్పుడు చూడలేదు. వాళ్ళ ఇంటిలో మీ ఫోటో ఉంది అది చూపించి స్వామీజీ చెప్పారు. అత్తగారు అంటే తల్లి, మామగారు అంటే తండ్రి, కోడలు అంటే కూతురు అని. మదర్ ఇన్ లా, ఫాదర్ ఇన్ లా, డాటర్ ఇన్ లా. మీరు మా తల్లితండ్రులతో సమానం అని అప్పటి నుంచి ఎంతో ప్రేమగా చూస్తోంది. మేము మిమ్మలని ఎప్పుడు చూడలేదు, గుంటూరులో ఉంటారని తెలిసివచ్చాం అన్నారు. ఈ విధంగా ప్రతి కోడలు అత్తగారిని తల్లి అనుకుంటే, ప్రతి అత్తగారు తన కోడలుని కూతురులా చూసుకుంటే సమాజం అంతా బాగుపడుతుంది. అలా సమాజాన్ని మార్చాలని సత్యసాయి అంటున్నాడు మార్చాలని విశ్వయోగి అనుకుంటున్నాడు, శక్తివంతమైన యోగులు మార్చాలని ప్రయత్నం చేస్తున్నారు. మనం మారాలా అక్కరలేదా అని మీరు తేల్చుకోండి. రెండు పద్ధతులున్నాయి. మనంతట మనం మనలని సవరించుకోవడం, లేకపోతే సవరింపబడడం. మనలని మనం సవరించుకోవడం శాంతియుతమైన పద్ధతి. భగవంతుడే మనలని సరిచేయాలనుకుంటే మాత్రం చాలా జాగ్రత్త. అది చాలా కఠినంగా ఉంటుంది, సుత్తిపెట్టి కొట్టి కంసాలి ఎలా బాగుచేస్తాడో అలా చేయాల్సి ఉంటుంది. కాబట్టి మనలని మనమే బాగు చేసుకుందాం. భగవంతుడికి చెప్పుదాం ప్రభూ నువ్వు మానవ ఆకారంలో రానక్కరలేదు, మమ్మలని మేమే

సరిచేసుకుంటాం, మేము చక్కగా ఉంటాం, అప్పుడు నువ్వు రావలిసిన పని ఉండదు అని చెప్పవలసిన అవసరం వుంది. శాంతి చాలా ముఖ్యం. మతం పేరుతో, దేవుడు పేరుతో హింస అనేది, ద్వేషం అనేది చాలా తప్పు. హృదయంలో శాంతిని, మనసులో ప్రేమను నింపుకోండి. మనసంతా శాంతిగా, హృదయం అంతా ప్రేమమయంగా వుండేటట్లు చేసుకుని ఆ మనోపుష్పాన్ని, హృదయ పుష్పాన్ని సత్యసాయి పాదాల వద్ద సమర్పించండి, ఆయన ఆ పుష్పాలకు సంతోషిస్తాడు కాని మామూలు వాటికి కాదు. అందరికి దివ్యమైన ఆశీస్సులు.

---

**వేదాంతకథాస్రవంతి**

# ఆదర్శ గృహస్థ

ఒక గృహస్థు తన తల్లితండ్రులు, పెద్దలు పట్ల ప్రేమ, గౌరవం కలిగి ఉండేవాడు. తన జీవితంలో ఆధ్యాత్మిక సాధన కొరకు సమయం ఏమాత్రం వినియోగించ లేకపోతున్నానని నిరాశ పొందాడు. ఒక మహాత్ముని దర్శించుకుని ఈ లౌకిక ప్రపంచంలో జీవనం గడుపుతూ భగవంతుని దర్శించుకోగలనా అని అడిగాడు. అప్పుడు ఆయన 'భగవంతుడు అంతటా ఉన్నాడు మనం గుర్తించగలగాలి. నీ తండ్రిని పరమేశ్వర స్వరూపమైన నారాయణుడుగా, నీ తల్లిని విశ్వమాత భగవతిగా భావించాలి. నీ భార్యను అదృష్ట దేవత అయిన లక్ష్మీదేవిగా, నీ కుమారుడుని బాల కృష్ణుడుగా భావించాలి. అప్పుడు నీ కుటుంబం దైవ కుటుంబం అవుతుంది. నీవు చేసేదంతా దైవానికి చేస్తున్నాననే భావనతో చేస్తే అది భగవంతునికి సమర్పించుకున్నట్లు అవుతుంది' అని వివరించాడు. ఆయన చెప్పిన విధంగా ఆ గృహస్థు ఆచరించి భగవంతుడుని దర్శించకోగలిగాడు.

*(స్వామి సంబుద్ధానంద యొక్క వేదాంత ట్రూ స్టోరీస్ నుండి సేకరణ)*

## గురు సూక్తము

# 'గురువు యొక్క మనస్సుతో వ్యక్తి తన మనస్సును అనుసంధానం చేసుకొనగలిగితే లభించేది పరమానందం'

**- భగవాన్ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్**

ప్రతి మనిషి తన జీవితం ఆనందమయంగా ఉండాలని కోరుకుంటాడు. ఆనందమనగా ఏమిటి?

మనిషి ఏదో ఒక కార్యం తలపెట్టి దానిని విజయవంతంగా నిర్వహించి నప్పుడు ఒక విధమైన సంతృప్తిని అనుభవిస్తాడు. ఆ సంతృప్తినే ఆనందమని భావించవచ్చు. భగవంతునిపై మనస్సును లగ్నం చేసి పూజించితే మనిషికి ఎంతో ఆనందం లభిస్తుంది. ఏ ఫలితం ఆశించకుండా భగవంతుని పూజించితే లభించే ఆనందాన్ని వర్ణించడం అసాధ్యం. సాక్షాత్తు భగవత్ స్వరూపులైన గురువును పూజించినా అంతే ఫలం పొందవచ్చు.

గురువు సమక్షంలో వారిపై మనస్సును లగ్నం చేసి కూర్చున్నట్లైతే పరమానందాన్ని పొందవచ్చు. ఈ విషయాన్నే గురుదేవులు శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ పై వాక్యంలో విశదీకరించారు, ఈ ఆనందానుభూతిని ఎందరో భక్తులు అనుభవించారు, అనుభవిస్తున్నారు.

మనిషి మనస్సు చంచలమైనది. దానిని స్థిరంగాఉంచడానికి కావలసిన శక్తిని గురువు ప్రసాదిస్తాడు. ఆ స్థిరత్వమే పరమానందం. మనిషికి బాల్యంలో ఈ ఆనందాన్ని తల్లి దండ్రులు, గురువులు, ఇతర పెద్దలు తమ మార్గదర్శకత్వం ద్వారా లభింపచేస్తారు. వయస్సు పెరిగిన కొలదీ తన ప్రవర్తన తన ఆలోచనా సరళిపైన ఆధారపడి ఉంటుంది. ఆలోచనలు సక్రమంగా ఉంటే ప్రవర్తన సక్రమంగా ఉంటుంది. మానవుడు సంఘజీవి. తన చుట్టూ ఉన్నవారి సంబంధం, ప్రేరణ అతని ప్రవర్తనపై ప్రభావం కలిగి ఉంటాయి. ముఖ్యంగా మనిషి ప్రవర్తనపైన గురువు యొక్క ప్రభావం చెప్పుకో దగినదిగా ఉంటుంది. అందుకనే భగవాన్ శ్రీ విశ్వంజీ మహరాజ్ గురువే తల్లి, తండ్రి దైవం అని అభివర్ణించారు. అట్టి గురువుతో సంబంధం పరమానందానికి హేతువు అవుతుందని పై వాక్యం ద్వారా బోధించారు. వారి మాట చిర స్మరణీయం, ఆచరణీయం!

# శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి

## (టెంబే స్వామి)

## సద్గురు చరిత్ర

# పదునెనిమిదవ అధ్యాయము

- శ్రీ జి.వి.ఎల్.ఎన్. విద్యాసాగర శర్మ

(గత సంచిక తరువాయి)

### ఏడవ చాతుర్మాస దీక్ష - పేట్‌లాడ్ (శక సం॥ 1819)

### దత్తప్రభువు అలక

లోగడ అధ్యాయములో మహారాజ్ ఉజ్జయిని నుండి పేట్‌లాడ్‌కు చేరికొనిరని చెప్పబడినది. పేట్‌లాడ్ ఇందూర్ సంస్థానములోని ఒక పట్టణము. అది మహీనదీ తీరమున నున్నది. అచ్చట చాలామంది బ్రాహ్మణుల గృహములు కలవు. శక సంవత్సరము 1819లో మహారాజ్ అచ్చట చాతుర్మాస దీక్ష జరిపిరి. అక్కడ వారు ఆషాఢ శుద్ధమందు "దత్తలీలామృతసింధు" వను ప్రాకృత భాషా గ్రంథమును ఒక వెయ్యి ఓ వీలతో వ్రాసిరి. చాతుర్మాస దీక్షానంతరము అక్కడ నుండి వారు బయలుదేరి "చిఖలద" అను గ్రామము చేరుకొనిరి. ఆ గ్రామములో వెంకట్రావను పేరుగల గృహస్థుడొకడు భార్యావియోగ దుఃఖము వలన ఉద్యోగము వదిలిపెట్టి, నదీతీరమున ఒక మందిరములో నివసించుచుండెను. అతడు మహారాజ్ దగ్గరకు పోయి "యోగాభ్యాస విధి నాకు నేర్పు"దని ప్రార్థించెను. మహారాజ్ ఆయనకు ప్రాణాయామము చేయుటెట్లో నేర్పి, ఆ పిదప ఆరువిధములైన ప్రాణాయామ లక్షణములను గూడ ఆయన కెరింగించెను. నానాసాహెబ్, గంగాధరరావు, బాలవైద్య మొదలగు వారికిగూడ ఆయన ఉపనిషత్తులు బోధించిరి. అచ్చట ప్రతిదినము వారు పురాణము చెప్పుచుండిరి.

మహారాజ్ పేట్‌లాడ్‌లో నున్న సమయమున దీపావళి పండుగ వచ్చెను. నరకచతుర్దశి రేపనగా మహారాజ్‌కు ఒక దృష్టాంతమయ్యెను. స్వప్నములో దత్తప్రభువు కనిపించి "రేపు నాకు అభ్యంగన స్నానము కావలయు"నని కోరెను.

"నేను సన్న్యాసిని. అగ్నిని ముట్టరాదు. వేడినీరు, సుగంధ ద్రవ్యములు ఎచ్చట నుండి నేను తేవలయును? అవి లేక అభ్యంగన స్నానము చేయించుటెట్లు? అభ్యంగన స్నానమునకు బదులుగా భస్మమలదిన చాలునని నీవు లోగడ చెప్పితివి. ఇప్పుడిట్లు కోరిన నేనేమి చేయగలను? భస్మము మాత్రమే పూసెద"నని మహారాజ్ చెప్పిరి. మరునాడు మామూలుగా మహారాజ్ నదిలో స్నానము చేసివచ్చి, దత్తమూర్తికి భస్మము పూసి పీఠముపై నుంచిరి. మహారాజ్ తనకు అభ్యంగన స్నానము చేయించలేదని దత్తప్రభువునకు కోపము వచ్చెను. ఆ కోపముతో ఆయన నర్మదా నదికిపోయి, నీటిలో దాగెను. ఆ విషయము మొదట మహారాజ్ గ్రహించలేదు. భిక్షకు పోయివచ్చి, కాలు సేతులు కడుగుకొని, నైవేద్యమిడుటకై మూర్తికడకు వచ్చెను. అప్పుడొక మహాధ్వని వినవచ్చెను. "ఈరోజు దీపావళి పండుగైనను నాకు మంగళస్నానము చేయించకయే నైవేద్యము పెట్టెదవేమి? నీ నైవేద్యమునకై నేనిక్కడేమియును కాచుకొని కూర్చుండలేదు. పోయి నదిలో కూర్చుంటిని" అని దత్తప్రభువు చెప్పెను. ఆ కోపవచనములు విన్నంతనే మహారాజ్‌కు భయము వేసెను. పీఠముపై దత్తమూర్తి అగుపించలేదు. వెంటనే వారు నదీతీరమునకు పరుగుదీసిరి. ఒకచోట నదీజలము నుండి పసిపిల్లవాని ఏడ్పువలె ఒక ధ్వని వినిపించెను. ఆ ధ్వని వినవచ్చిన వైపు చూడగా దివ్యతేజస్సుతో ప్రకాశించుచు, నీటిపై తేలియాడుచు దత్తమూర్తి కనిపించెను. తక్షణమే మహారాజ్ నదిలోనికి దిగి, ఆ మూర్తిని ఆప్యాయముగా అందుకొని కనుల కద్దుకొనిరి. భిక్షా సమయమున మహారాజ్ నదీతీరమున కెందుకు వేగిరపాటుతో పోయిరో? అర్థముగాక, గ్రామస్థులాయనను వెంబడించి నదీతీరమునకు పోయిరి. మహారాజ్ జరిగిన విషయమంతయు వారికి చెప్పెను. వెంటనే వారందరు ఉష్ణోదకము, సుగంధ ద్రవ్యములు, పంచామృతములు తెప్పించి, అత్యంత శ్రద్ధాభక్తులతో దత్తమూర్తిని అభిషేకించి, పూజించి, హారతి, మంత్రపుష్పము సమర్పించిరి. ఈ జరిగిన విషయమునంతయు నొక అభంగరూపముగా మహారాజు పాడి దత్తప్రభువు నర్చించిరి.

**"మిత్రమిత్ర జరి భాండతి తరీ పునః ఏకహోతీ**
**దంపతీ చాహో కలహో లవమాత్ర వతుటే స్నేహ**

**దేవభక్తాంచే భాండనే పరాభక్తీ చేతే ఠాణే**
**వాసూమణే హా వినోద్ దేతో దత్తాపరానంద్**
**జ్ఞానోత్తర భక్తీచేహె దివ్యదర్శన ఝూళ్యానే**
**సర్వలోక విస్మయ చకిత ఝూలే."**

"స్నేహితులు పరస్పరము కలహించుకొని తాత్కాలికముగా విడిపోయినను తిరిగి అచిరకాలములోనే ఏకమగుదురు. ఇక ఆలుమగుల మధ్య కలహము అద్దము మీది బియ్యపు గింజవంటిది. అది క్షణకాలము మాత్రమే యుండును. పరమాత్మకు పరాభక్తి కలిగిన భక్తులకు మధ్య వచ్చిన కలహము కూడ ఇట్టిదే. తనకును భగవంతునకు మధ్య జరిగిన కలహము సర్వులకు ఆశ్చర్యము కలిగించునట్టిదైన"దని ఈ అభంగము యొక్క భావము. జ్ఞానోత్తర కాలీన భక్తి పరమోత్తమ సుఖస్వరూపమైన భక్తి. సగుణమూర్తి ఆరాధనచేతనే నిర్గుణ ధ్యానము, జ్ఞానము ఎట్లు కలుగునో? ఈ లీల ద్వారా దత్తప్రభువు లోకమునకు వెల్లడించిరి.

## సగుణోపాసన ప్రాశస్త్యము

పైన చెప్పిన విధముగా మహారాజ్ అభంగము పాడి దత్తప్రభువును స్తోత్రము చేయగా విని, ఆ గ్రామవాసులైన వెంకట్రావ్, నానాసాహెబ్, గంగాధర రావ్, బాలవైద్యా మున్నగువారు ముకుళితహస్తులై "మీరు సన్యాసాశ్రమము స్వీకరించినను సగుణోపాసన చేయుచునేయున్నారు. సగుణోపాసన ప్రాశస్త్యము మాకు తెలియజేసి, కృతార్థులను చేయు"దని ప్రార్థించిరి. మహారాజ్ అందరిని కలయజూచి "సగుణోపాసన ప్రతి మనుజుడును తప్పక చేయవలయును. లేనిచో బ్రహ్మ సాక్షాత్కారము పొందజాలడు. ఏ రాజునకైనను తనకున్న ఐశ్వర్యము ననుభవించుచు అధికారము చెలాయింపక సామాన్య మానవుని వలె ప్రవర్తించి నచో గౌరవమేమియుండును? దేవుని సగుణోపాసన పద్ధతిగా అర్చించనిచో ఆయన మాహాత్మ్యము మనమెట్లు గుర్తించినట్లగును? శాస్త్రములు రాజశాసనము లవంటివి. రాజశాసనములు జనులకెట్లు అనుల్లంఘ్యనీయమై శిరోధార్యము లగుచున్నవో, శాస్త్రములను అదేవిధముగా జనులకు అతిక్రమించరానివిగా నుండుచున్నవి. శాస్త్రములు సగుణోపాసన చేయుమని శాసించుచున్నవి.

మానవుడు దానికి యొడంబడి సగుణోపాసన చేయవలెను. సగుణోపాసన చేయనిదే నిర్గుణోపాసన స్థాయికి మానవుడు పోలేడు" అని వివరించిరి. మహారాజ్ గ్రామములో మరికొన్ని దినములుండి, ఆ తరువాత బయలుదేరి, శక సంవత్సరము 1820 వైశాఖ శుద్ధ దశమినాడు నర్మదా తీరమున నున్న తిలక్‌వాడ చేరిరి. ఆ సమయమున ఆ గ్రామమున ప్లేగువ్యాధి వ్యాపించి యుండెను. అది అంటుజాడ్యము. ఆ వ్యాధి యితర గ్రామములకు వ్యాపించుచున్న భయముతో ఆ గ్రామము నుండి ఎవరిని సర్కారువారు ఇతర గ్రామములకు పోకుండ కట్టుదిట్టములు చేసి ఆపుచుండుటచే, మహారాజ్ ఆ గ్రామములోనే ఆగిపోవలసి వచ్చెను.

ఓం నమో శ్రీ దత్తాత్రేయాయ

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

పదునెనిమిదవ అధ్యాయము సంపూర్ణము.

# పందొమ్మిదవ అధ్యాయము

## ఎనిమిదవ చాతుర్మాస దీక్ష - పేట్‌లాడ్ (శక సం॥ 1819)

## మణిశంకర్‌కు సంతానప్రాప్తి

తిలక్‌వాడలోని మారుతీ మందిరములో మహారాజ్ యొక్క ఎనిమిదవ చాతుర్మాస దీక్ష జరిగెను. తిలక్‌వాడ బరోడా సంస్థానములో నున్నది. ఆ గ్రామమున దక్షిణాది బ్రాహ్మణులు, గుజరాతి బ్రాహ్మణులు ఉద్యోగము చేయుచు నివసించుచుండిరి. అచ్చటి బ్రాహ్మణులెల్లరు సాత్త్విక ప్రవృత్తి కలవారగుటచే నిత్యము మహారాజ్ దర్శనార్థము వచ్చుచుండిరి. పిశాచ బాధాగ్రస్థులు, రోగులు, సంతానము లేనివారు మొదలైన వారెందరో మహారాజు చెప్పు ఉపాయముల కొఱకై అత్యంత భక్తితో వచ్చి, దర్శించుకొని వారు చెప్పినట్లుచేసి బాధా విముక్తు లగుచుండిరి. ఒకదిన మాయూర నివసించు మణిశంకర్ అను గుజరాతి బ్రాహ్మణుడొకడు మహారాజ్ దగ్గరకు వచ్చెను. తన జన్మకుండలిని మహారాజ్‌కు చూపించి "నాకు సంతానము లేకపోవుటకు కారణమేమి?" యని అడిగెను.

మహారాజ్ ఆ జన్మ పత్రిక జూచి "నీవు పూర్వజన్మములో ఒక సర్పమును చంపిన దోషము నీ సంతతికి ప్రతిబంధక మగుచున్నది. ఆ దోషము దూరమగుటకు నీవు నాగపంచమీ వ్రతము, నాగబలి చేయవలెను. అట్లుచేసిన నీకు సంతానము కలుగు"నని చెప్పిరి. మహారాజ్ ఆజ్ఞాపించిన ప్రకారము అతడాపనులు చేసిన వెంటనే ఆయనకొక కుమారుడు జన్మించెను. పురజనుల కోరిక మేరకు మందిరము నుండి గ్రామంలోనికి మహారాజ్ నిత్యము పోయి నర్మదాఖండ పురాణము చెప్పుచుండిరి. అచ్చటనే ఆంధ్రలిపిలో వ్రాసిన సంస్కృత కూర్మ పురాణమును, దేవనాగర లిపిలో వ్రాసికొని వారు పురాణము చెప్పిరి.

## గోవింద ఆత్మారాం

ఆ గ్రామములో గోవింద ఆత్మారాం కారంజ గ్రామకర్ అనువాడొక డుండెను. అతనికి తల్లి, బంధువులున్నను అతడు బరోడాలో నుండెడివాడు. ఉద్యోగము సద్యోగము లేక అచ్చుబోసిన ఆబోతువలె వాడు ఊరక తిరుగుచుండెను. ఒకనాడు అతని తల్లి మహారాజ్ దగ్గరకు వచ్చి, తన కుమారున కేదైనను ఉద్యోగము దొరుకు ఉపాయము చెప్పుడని ప్రార్థించెను. మొదట మహారాజ్ "నాకేమియు తెలియ"దని తప్పించుకొనజూచెను. కాని, ఆ తల్లి దీనముగా వేడుకొనుటను జూచి, జాలిపడి "ముందు నీ కుమారుని ఇక్కడకు పిలిపించుము. తర్వాత చెప్పెద"ననెను. తల్లి పిల్లవానిని పిలిపించెను. దివ్య తేజస్సుతో తేజరిల్లుచున్న మహారాజ్‌ను చూడగనే గోవింద్‌కు ఆయనపై ఎనలేని భక్తి శ్రద్ధలు కలిగి, అనన్య భావముతో వారి పాదములకు నమస్కరించి నిశ్చింతు డయ్యెను. మహారాజ్ అతనిని జూచి "నదిలో స్నానము చేసి, తడి బట్టలతో నా దగ్గరకు ర"మ్మని ఆజ్ఞాపించిరి. అతడట్లు చేసిరాగా, అతనికి ఒక మంత్రము వ్రాసియిచ్చి, జపించుమని చెప్పిరి. మహారాజ్ ఆజ్ఞానుసారము అతడా మంత్రమును శ్రద్ధగా జపించెను. దాని ఫలితముగా పది పదిహేను రోజులలో అతనికి ఉద్యోగము లభించెను. ఏబది ఆరు సంవత్సరములు నిండువరకు అతడా ఉద్యోగము చేసెను. తర్వాత స్వచ్ఛందముగా ఉద్యోగ విరమణచేసి ఫించను తీసికొనెను. ఆ తరువాత అతడు గరుడేశ్వరము వచ్చినప్పుడు "నీవు

స్మార్తాగ్నిని తీసుకొనవలయునని'' మహారాజ్ ఆజ్ఞాపించిరి. ఆ ఆజ్ఞానుసారమతడు భార్య జీవించి యున్నంతవరకు అగ్నిసేవ చేయుచుండెను. "స్వధర్మాచరణము వలన పరమేశ్వరుడు సంతసించి మనకు శుభములు చేకూర్చు"నని తరచుగా మహారాజ్ పలుకుచుండెడివారు.

## నర్మదాబాయి

"గణేశ అణగరే" యను పేరుగల వాడొకడు ప్రభుత్వోద్యోగము చేయుచుండెను. ఆయన భార్య పేరు నర్మదాబాయి. ఆ దంపతులకు సంతానము లేకుండెను. నర్మదాబాయికి ఒక తల్లి యుండెను. ఆమె పేరు వారూబాయి కారంజ గ్రామకర్. ఆమె తిలక్‌వాడలో నివసించుచుండెను. ఆమెకొక నియమ ముండెడిది. నర్మదా ప్రదక్షణములు చేయు యాత్రికులకు భాండీలు, అన్నము, వస్త్రములు మొదలైనవి ఎవరికేమి కావలసిన, అవి వారికిచ్చి సహకరించుచుండెడిది. సన్యాసులు వచ్చినచో భిక్ష నిడుచుండెడిది. ఈవిధముగా ఆమె నియమపాలన చేయుచుండెను. కొన్ని రోజులు గడచెనను. మహారాజ్ తిలక్‌వాడకు రాగానే అచ్చట దక్షిణాది బ్రాహ్మణుల యిండ్లు లేకపోవుటచే ఆమె మహారాజ్ దగ్గరకు వచ్చి, "భిక్ష గ్రహించు"డని ప్రార్థించెనను. ఆమె ప్రేమపూర్వకమైన ప్రార్థనకు లోబడి అప్పుడప్పుడు మహారాజ్ ఆమె యింటికి భిక్షకు పోవుచుండిరి. ఒకరోజు మహారాజ్ భిక్షకురాగా వారూబాయి చిరుకోపముతో మహారాజ్‌ను చూచి "మహారాజ్! మీవంటి వారిని సేవించిన ఫలమేమి? నా బిడ్డకు ఇంతవరకు సంతానము లేదు కదా!" అనెను. మహారాజ్ నవ్వి "నీ బిడ్డకు తప్పక కుమారుడు పుట్టును. నీవేమియు విచారించవలసిన పనిలేదు. ఆ పిల్లవానికి ఐదవ నెలరాగానే శూల నాగేశ్వర దేవాలయమునకు పోయి, గోధుమ పొట్టుతో ఆ పిల్లవానిని తూచి తీసికొనిరమ్ము. ఆ పిల్లవానికి వాసుదేవ్ అని పేరు పెట్టు"మని చెప్పిరి. మహారాజ్ ఆశీర్వాదబలము వలన వారూబాయి కూతురైన నర్మదాబాయికి ఒక కుమారుడు జన్మించెను. ఆ పిల్లవాని ఉపనయన ముహూర్తము మహారాజే పెట్టెను. వడుగైన తరువాత విద్యాప్రద మంత్రమిచ్చి అతనిని నిష్ఠతో వారు జపించుమని చెప్పిరి. ఆ పిల్లవాడా మంత్రమును జపించుచుండెను. పెద్దవాడైన తరువాత అతనికి కాలెవాడలో

చూడా నరేశ్ అనువాని దగ్గర సంగీతము నేర్పెడి ఉద్యోగము దొరికెను. అతనికొక పిన్నమ్మ యుండెను. ఆమె పేరు వేణూబాయి, ఆమె బాల వితంతువు. యోగాభ్యాసము చేయుచుండెడిది. ఆమెకు సమాధి స్థితికి చేరుకొను వరకు యోగాభ్యాసము సిద్ధించెను. దినము విడిచి దినము ఆమె తడి బట్టలతో చల్లకుండ నెత్తిన బెట్టుకొని తిలక్‌వాడ నుండి గరుడేశ్వరము మహారాజ్ కొఱకు పోవు నియమామెకు ఉండెడిది. (మహారాజ్ తమ చివరి చాతుర్మాస దీక్ష జరుపుటకు గరుడేశ్వర్ పోయి యున్న సమయములతో జరిగిన విషయమిది) ఒకసారి గురువార మేకాదశి వచ్చెను. వాసుదేవ్, ఆయన తల్లి నర్మదాబాయి, తిలక్‌వాడలోని పోలీసు అధికారి హార్డీకర్, అతని భార్యపిల్లలు అందరు కలసి మధ్యాహ్నము మహారాజ్ కొఱకు గరుడేశ్వరము బయలుదేరిరి.

"మాటిమాటికి గరుడేశ్వరము రావల"దని మహారాజ్ పూర్వము నర్మదాబాయికి చెప్పియుండిరి. కాని ఆమె ప్రేమాతిశయమున మహారాజ్‌ను చూడవలయునని ఆ ఆజ్ఞను ఉల్లంఘించి బయలుదేరెను. దారి మధ్యలో చీకటిపడెను. ఆ అంధకారములో వారు దారి తప్పిరి. ఒకచోట వారు పోవు మార్గములో గట్టుకూలి, దారి మూయబడి యుండెను. ఆ చీకటిలో ఏమి చేయవలెనో తోచక భయముతో అందరు గుండె చెదరి పోవుచుండిరి. పిల్లలు ఏడువసాగిరి. అప్పుడు అందరును మహారాజ్‌ను తలచుకొని ప్రార్థించిరి. అకస్మాత్తుగా వారికి కొంతదూరములో ఒక ప్రక్కగా **"గురుదేవదత్త"** అని మహారాజ్ కంఠస్వము వినిపించెను. అది వినిపించగానే అందరును సంభ్రమముతో ఆ ధ్వని వినవచ్చిన దిశగా బయలుదేరిరి. కొంతదూరము పోయిన తరువాత మరల ఆ శబ్దము కొంచెము దూరములో వినిపించెను. వారు మరల ఆ ధ్వని వినవచ్చిన దిశగా నడచిరి. ఈవిధముగా వారు ధ్వని ననుసరించి నడచుచు, ఆ చీకటిలో సురక్షితముగా గరుడేశ్వర్ చేరుకొనిరి. ఆ సమయములో గరుడేశ్వరమునందు భజన జరుగుచుండెను. భజనయైన తరువాత తిలక్‌వాడ నుండి వచ్చిన వారందరు మహారాజ్ దర్శనము చేసికొనిరి. అప్పుడు మహారాజ్ నర్మదాబాయిని జూచి "ఈ ఒక్కసారికి మాత్రము దత్తమహారాజ్ మీకు దారి చూపించెను. ఇకముందు ఇటువంటి పొరబాటు

చేసిన నా జవాబుదారి లేదు” అని కోపముగా పలికిరి. మహారాజ్ కోపించి పలికినను వారి దర్శనభాగ్యము లభించినందుకు వారికందరికి పరమానంద మయ్యెను.

## రామశాస్త్రి వృత్తాంతము

ఆశ్వీజ మాసములో మహారాజ్ తిలక్‌వాడ నుండి బయలుదేరిరి. దారిలో మణినాగేశగరము, కుంభేశ్వరము, గంగనాథ్, మహాదేవ్ మున్నగు పుణ్యక్షేత్రము లను దర్శించుచు, కర్నాళి, చాందోద, వ్యాస్, శుక్ మొదలైన క్షేత్రములను గడచి, బర్కాళ్ దగ్గరయున్న అత్రిమహర్షి ఆశ్రమమును చేరుకొనిరి. అచ్చట అనసూయామాత స్తోత్రమును పదరూపముగా జేసిరి. అచ్చట నుండి కార్తీక బహుళ పక్షమునందు ‘శినూర్’ గ్రామము చేరుకొని, అచ్చటగల భూషకళివాడా లోని విఠల్ మందిరము నందు మొదట విడిసిరి. తర్వాత మార్కండేశ్వర మందిరములో ఆ దేవస్థాన పంచాయతీ మెంబరైన షోడష్కర్ జాగ్రోత్ అను గుజరాతీ బ్రాహ్మణుని అభ్యర్థనపై నెలా పదిహేను రోజులుండిరి. ఆ గ్రామమునందు రామశాస్త్రి ప్రకాశకర్ అను బ్రాహ్మణుడొకడుండెను. తమ గ్రామమున కొక సన్న్యాసి వచ్చెనని తెలియగనే అతడు మహారాజ్ దగ్గరకు వచ్చెను. ఠీవిగా మహారాజ్ ముందు నిలిచి, ఏదో మొక్కుబడిగా నమస్కరించినట్లు చేతులు జోడించి, వినయ విధేయత లేమాత్రము జూపక ఒక ప్రక్కన ఉన్న వెండి దత్తమూర్తివైపు చూచుచుండెను. కొంతసేపట్లు గడచిన తరువాత “ఏమి మహారాజ్? ఎక్కడినుండి వచ్చుచున్నారు?” అని ప్రశ్నించెను. మహారాజ్ చేతితో తాము వచ్చిన దిశవైపు సైగచేసి చూపించిరి. ఆ తర్వాత అతడు “అసలు మీదేయూరు? పూర్వాశ్రమములో మీ పేరేమి? మీరేమి చేయుచుండెడివారు? ఎక్కడ చదువుకొన్నారు?” మొదలైన ప్రశ్నలు వరుసగా వేయుట మొదలుపెట్టెను. మహారాజ్ కోపించి “మీవాడెవడైనను తప్పిపోయెనా ఏమి? ఇన్ని ప్రశ్నలు వేయుచున్నావు. ఆ వ్యక్తిని నేనుగాదు” అనిరి. ఆ మాటలు వినగనే రామశాస్త్రికి కోపము వచ్చి, చివుక్కున లేచి అచ్చట నుండి వెడలిపోయెను.

లీలానంద సరస్వతీస్వామి అనువారు ఆరేడు సంవత్సరములనుండి మహారాజ్ ఉండెడి మార్కండేశ్వర మందిరము క్రిందిభాగములో నివాసము

చేయుచుండిరి. వారి చాతుర్మాసములు తమ కంటె ఎక్కువైనందున ఆయనకు నమస్కరించి మహారాజ్ గౌరవము చూపెడివారు. ఒకనాడు మహారాజ్ నమస్కారము చేయగా, ఆ స్వామి "నా దగ్గర ముద్రలు, దండసూత్రము, కటిసూత్రము లేనందున నీకంటె నేను వందనయోగ్యుడను కా"ననిరి. ఆ మాటలు విని మహారాజ్ "కటిసూత్రము, దండసూత్రము తరువాత నేను ఏర్పాటు చేసెద"ననిరి. ప్రతిదినము ఇరువురును కొంతసేపు మాట్లాడుకొను చుండెడివారు. ఒక సమయమున స్వామితో మాట్లాడుచు మహారాజ్ "ఏమి చేయుదును? రామచంద్రుని కొఱకు నేనిచ్చటకు వచ్చితిని. అతడు మాత్ర మిచ్చుటకు రానే రాడు. ఒకసారి మాత్రము వచ్చి ముఖము చూపించిపోయెను" అని విచారముగా పలికిరి. అది విని లీలానందస్వామి "రామశాస్త్రిని నేను తీసుకొని వచ్చెద"నని చెప్పి, రామశాస్త్రి దగ్గరకు పోయి "మహారాజ్ దగ్గరకు పోదమురమ్మ"ని పిలిచెను. అప్పుడు రామశాస్త్రి "టెంబేస్వామి విద్వాంసుడైనను అతికోపిష్ఠి యగుటచే ఆయన యనగా నాకు సరిపడదు. నేనాయన దగ్గరకు రాను" అని చెప్పి, అక్కడ నుండి లేచిపోయెను.

ఆ గ్రామములో రామశాస్త్రి తన మేనమామ యింటిలో నివసించుచు చుండెను. ఆ యింటిలో ఒక ముసలమ్మ ఉండెను. ఆమె మంచి వ్యవహార దక్షురాలు. రామశాస్త్రిపై ఆమెకు అత్యంత ప్రేమ యుండెడిది. ఆమె మహారాజ్ పేరు విని, ఆయన దగ్గరకు పోయి ఏమైనను నేర్చుకొనవలయునని చాలా కాలమునుండి ఆకాంక్షించుచుండెను. లీలానందస్వామి పోయి ఆ ముసలమ్మ తోడను, రామశాస్త్రి మేనమామతోడను "ఎటులైనను రామశాస్త్రిని మహారాజ్ దగ్గరకు వచ్చునట్లు చేయు"డని గట్టిగా చెప్పెను. వారు రామశాస్త్రిని మహారాజ్ దగగ్రకు పోవలసినదని వత్తిడి చేయసాగిరి. ఆ విధముగా తనకిష్టము లేకపోయినను, ఇంటిలోని వారి బలవంతము చేత రామశాస్త్రి మహారాజ్ యొద్దకు వచ్చెను. అప్పుడైనను అతని ఔద్ధాత్యము తగ్గలేదు. ఏదో నమస్కరించినట్లు చేతులు జోడించి, ఒక ప్రక్క నిర్భయముగా కూర్చుండెను. రామశాస్త్రిని చూచి మహారాజ్ "నీవేమి చదువుకొంటి"వని ఇంకను ఏమేమో అడుగబోవుచుండగా, వెంటనే రామశాస్త్రి "నాకు వేదాధ్యయనమైనది. కౌముది

చదువుకొన్నాను. పంచకావ్యములు నేర్చుకొంటిని. ఇప్పుడు నేనొక చోట భాగవత పురాణము చెప్పుచున్నాను'' అని గబగబ గుక్క తిప్పుకొనకుండ, పాఠమప్పగించినట్లు చెప్పెను. మహారాజ్ **"జన్మాద్యస్య యతో న్వయాత్"** అను శ్లోకము చదివి భావము చెప్పుమని కోరిరి. అప్పుడు రామశాస్త్రి "నేనిటువంటి కఠినమైన వేదాంతార్థము గల శ్లోకముల భావము చెప్పలేను. శ్లోకములు మాత్రమే చదువుగలను" అనెను. "ఈ మొదటి శ్లోకమునకే అర్థము చెప్పలేని వాడవు మిగతా గ్రంథమేమి పురాణము చెప్పెదవు?" అని మహారాజ్ పలికిరి. అది వినగానే రామశాస్త్రికి ఒక సంవత్సరము క్రింద దృష్టాంతమైన స్వప్న విషయము చప్పున జ్ఞాపకము వచ్చెను. వెంటనే అతని కోపమంతయు పటాపంచలై పోయెను. ఆనందపరవశుడై మహారాజ్‌ను సమీపించి, సాష్టాంగ నమస్కారము చేసి, డగ్గుకత్తితో "ఈ మూర్తినే నేను స్వప్నములో దర్శించితి"నని పలికెను. "ఇప్పుడు నీవు ఇంటికిపోయి, నీ యుద్యోగము వదలి నా దగ్గరకు విద్యాభ్యాసమునకు రమ్ము! పంచదశి, భాగవతములోని మొదటి శ్లోకము ప్రారంభము చేసెద"నని మహారాజ్ చెప్పిరి. ఆవిధముగా రామశాస్త్రి మహారాజ్ యొద్ద విద్యాభ్యాసము మొదలుపెట్టెను.

ఆయన విద్యాభ్యాసము నిర్విఘ్నముగా కొనసాగుచుండెను. భాగవతములోని వేదస్తుతి మొదలైన కఠిన విషయములను అత్యంత సుబోధకముగా వివరించు ప్రతిభ మహారాజ్ దగ్గరయుండెను. పాఠము చెప్పుచుండగా మహారాజ్‌ను నిరుత్తరునిగా చేయవలెనని నిశ్చయించి, ఒకసారి రామశాస్త్రి కొన్ని విషయములను ప్రశ్నించవలయునని ముందుగా సిద్ధము చేసుకొని వచ్చెను. ఆరోజు పాఠము చెప్పిన తరువాత మహారాజ్ అతనితో విద్య చెప్పెడి గురువును, తన విద్య పూర్తియగు పర్యంతము ప్రశ్నించి, నిరుత్తరుని చేయవలెనని శిష్యుడనుకొనరాదు" అని పలికి మిన్నకుండిరి. రామశాస్త్రి తానే విషయములను గూర్చి ప్రశ్నించవలయుననుకొనెనో ఆ విషయముల నన్నింటిని ఆ రోజు రామశాస్త్రి ప్రశ్నించకముందే, మహారాజ్ ప్రసంగరూపముగా, సోపపత్తికముగా నిరూపించి పాఠము చెప్పుట జరిగినది. ఆనాటితో రామశాస్త్రి గర్వము సమూలముగా తొలగిపోయెను.

మహారాజ్ దర్శనము కాకపూర్వమే రామశాస్త్రికి దృష్టాంతమై యుండెను. రామశాస్త్రి తండ్రి బరోడాలో నుండెడివాడు. వేదాధ్యయన నిమిత్తము రామశాస్త్రి శినూర్ వచ్చియుండెను. అతనికి పదునెనిమిదేండ్లు రాగానే తండ్రి ప్లేగు వ్యాధిచే చనిపోయెను. రామశాస్త్రి పితృవియోగ దుఃఖము భరించలేక, ఇల్లువిడిచి యెక్కడికైనను వెళ్ళిపోవలయు ననుకొనెను. ఆ రోజురాత్రి రామశాస్త్రికి స్వప్న దృష్టాంతమయ్యెను. స్వప్నములో ఒక సన్యాసి గోచరించి "నీవు ఇంటి నుండి వెళ్ళిపోయిన నీ తల్లి యెంత బాధపడునో నీకు తెలియదు. కర్దమఋషి వనములోనికి తపస్సుకు పోయినను కూడ, కపిలమహర్షి తన తల్లిని విడువకుండ, ఆధ్యాత్మిక భావమును బోధించి, దుఃఖోపశమనము కలిగించెను" అని చెప్పెను. ఆ మాటలు విని రామశాస్త్రి ఆయనతో "ఆధ్యాత్మికమనగా నాకు తెలియ" దనెను. అప్పుడాస్వామి "జీవద్బ్రహ్మము యొక్క ఐక్యప్రతిపాదనమే ఆధ్యాత్మ" మనెను. అప్పుడు రామశాస్త్రి "అది నాకెట్లు తెలియగలదు?" అని ప్రశ్నించెను. "నీకిప్పుడు ఉపదేశమునకు యోగ్యత రాలేదు. ఒక సంవత్సరము తర్వాత నీకు తెలియవచ్చు"నని స్వామి చెప్పెను. ఇరువరి మధ్య ఈ సంవాదము స్వప్నమునందు సంస్కృతములో జరిగెను. రామశాస్త్రికి స్వప్నములో తరచుగా ఆ సన్న్యాసి కనిపించుచుండెడివారు. అట్లు కనిపించి నప్పుడెల్లను కొన్ని సూచనలుగూడ చేసెడివారు. ఆ సూచనలను అతడు ఉల్లంఘించినచో, నాటిరాత్రి మరల స్వప్నములో కనిపించి శిక్షించు చుండెడివారు. ఆ ప్రకారము రామశాస్త్రికి అర్హత కలిగి, ఉపదేశ సమయమాసన్నమైనందున, దత్తప్రభువు ఆజ్ఞానుసారము మహారాజ్ ఆ గ్రామమునకు వచ్చుట సంభవించెను.

రామశాస్త్రికి మహారాజ్ యొద్ద విద్యాభ్యాసముతోనే కాలమంతమయు గడుచుచుండెను. మరికొంత సమయము భిక్షకు, ఆహ్నికమునకు గడిచి పోయెడిది. ఈ తీరున చదువుసాగుచుండగా అతని శ్రద్ధకు మహారాజ్ సంప్రీతులై తాము నీరు త్రాగుటకు వాడుకొనెడి కొబ్బరిచిప్పను మహాప్రసాదముగా రామశాస్త్రికిచ్చిరి. రామశాస్త్రి దానిని ప్రాణప్రదముగా తన యింటిలో భద్ర పరచెను. అట్లుండగా ఒకసారి మహారాజ్ ఎవ్వరికి చెప్పకుండ అక్కడినుండి ఎక్కడికో వెడలిపోయిరి. రామశాస్త్రి మహారాజ్‌తోడి వియోగమునకు దుః

ఖించుచుండగా స్వప్నములో గోచరించి "విచారించకుము. యోగాయోగముచేత నీకెంత విద్య ప్రాప్తించినదో దానిని కాపాడుకొని ఉపాసించుము. దండము యొక్క లక్ష్మీవస్త్రము, కటిసూత్రము మందిరము గూటిలో నున్నవి. వానిని నర్మదా ప్రవాహములో నైనను పడవేయుము. లేదా నీ దగ్గరనైనను ఉంచుకొనుము" అని చెప్పిరి. రామశాస్త్రి సమాధానపడెను. లక్ష్మీవస్త్రము, కటిసూత్రము తన దగ్గరనే ఆయన యుంచుకొనెను.

## మహారాజ్ సర్వజ్ఞత

శినూర్‌లో మహారాజ్ నివసించు చున్నప్పుడు ఒక గుజరాతీ వృద్ధ వితంతువు మహారాజ్ దర్శనార్థము వచ్చెను. ఆమె కండ చక్కెర నింపిన ఒక పెద్ద దొప్పను మహారాజ్ ముందట పెట్టెను. మహారాజ్ ఆ దొప్పవైపు కన్నెత్తి యైనను చూడలేదు. ఆ దొప్పలోని కండచక్కెరను తీసుకొని ఎవ్వరితోడను చెప్పలేదు. రెండు మూడు రోజులపాటు ఆ దొప్పలో పెట్టిన కండచక్కెర పెట్టినట్లే యుండెను. "ఆ దొప్ప మీరెందుకు స్వీకరించలే?"దని రామశాస్త్రి ఉత్కంఠ నాపుకొనలేక మహారాజ్‌ను ప్రశ్నించెను. అప్పుడు మహారాజ్ "మూడు రోజుల నుండి ఈ దొప్ప ఇక్కడనే యున్నది. అయినను నీవు చూచుచునే యున్నావుగదా! దీనిమీద ఒక ఈగయైన వాలినదా?" అని ప్రశ్నించిరి. రామశాస్త్రి దొప్పవంక కన్నార్పకుండ చూచెను. దొప్ప చుట్టు దూరముగా ఎన్నో ఈగలుండెను. కాని దొప్పమీద ఒక్క ఈగైనను వ్రాలుటలేదు. ఆ విచిత్రము చూచి "మీరు చెప్పింది నిజమే. అందుకు కారణమేమి? యని అతడు మహారాజ్‌ను అడిగెను. అప్పుడు మహారాజ్ "ఆ విషయములో నీకేమి అవసరము? ఎవరి వస్తువు వారే తీసుకొని పోదురు" అని మౌనమును వహించిరి. అది విని ఆ వృద్ధురాలు భిన్నురాలై తన దొప్పను తానే తీసికొనిపోయెను. తరువాత విచారించగా ఆ వృద్ధురాలు తన యౌవనదశలో అతి దురాచారపరురాలై యుండి యున్నట్లు తెలియవచ్చెను.

అవధూతచింతన శ్రీ గురుదేవదత్త

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

పందొమ్మిదవ అధ్యాయము సంపూర్ణము.

(సశేషం)

## స్త్రీ సూక్తము

# శ్రీమతి ఈశ్వరమ్మ

అలనాడు రామాయణంలో కౌసల్య ధర్మమూర్తియైన శ్రీరామచంద్రునికి తల్లియై 'కౌసల్యా సుప్రజా రామ పూర్వాసంధ్యా ప్రవర్తతే' అంటూ సుప్రభాతవేళ యుగాలు దాటినా, జగత్తు మార్పు చెందుతూ వచ్చినా, ప్రతినోట కౌసల్య స్మరింపబడుతూ ధన్యత్వం చెందుతోంది. శ్రీరామచంద్రుని కీర్తి ప్రతిష్ఠలు జగద్వ్యాప్త మవడానికి ఏవిధంగా మాతృదేవి కౌసల్య కారకురాలయిందో, ఈనాడు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా కీర్తిప్రతిష్ఠలు విశ్వవ్యాప్తమవడానికి మాతృశ్రీ ఈశ్వరమ్మ కారకురాలు అయినది. 'ఈశ్వరాంబ సుత' అంటూ ప్రతినిత్యం బ్రాహ్మీముహూర్తంలో దేశవిదేశీయులందరు విశ్వవ్యాప్తంగా సత్యసాయితో బాటు ఆమెను ముందుగానే కీర్తిస్తున్నారు. ఇలాగే తరతరాలపాటు ఈ 'విశ్వజననిని' తలచుకోని వారుండరు. అటువంటి అదృష్టాన్ని ఆతల్లికి భగవాన్ సత్యసాయిబాబావారే ప్రసాదించారు. కారణం అవతారమూర్తులు వారి తల్లిదండ్రులని నిర్ణయం చేసుకుని వస్తారు కాబట్టి. ఈశ్వరాంబ ప్రియనందనా అని, ధన్యహో ఈశ్వరాంబా అని, మనం ఈనాడు పాడుకుంటూ మన పిల్లలకి నేర్పుతున్నాము. అందరు తల్లులూ, కోరుకున్నట్లే ఈశ్వరాంబ కూడా తన బిడ్డ బాగా చదువుకోవాలని, చక్కటి ఉద్యోగం చేయాలని, క్రమశిక్షణతో మెలగాలన్న కోరిక ఉండేది. సత్యనారాయణ ప్రసాదం స్వీకరించిన వెనువెంటనే కాన్పు రావడం మగబిడ్డ జన్మించడం వలన 'సత్యనారాయణరాజు' అని ఈ బాలునికి నామకరణం చేసారు. గర్భిణిగా నున్న సమయంలో ఇంటిలోని వాయిద్యాలు వాటంతట అవే మ్రోగడం ఇంటి వారిని అబ్బుర పరచింది. తాతగారైన శ్రీ కొండమరాజుగారు, వీనుల విందుగా రాత్రి పూట వినిపిస్తున్న సంగీతంవిని, మృదంగం వీణా వంటి వాయిద్యాలు వాటంతట అవే మ్రోగడాన్ని గురించి పండితులైన జ్యోతిష్కుల్ని సంప్రదించారట. ఇది శుభ సూచకమని, ఎవరైనా ఆ ఇంట గర్భం ధరించి గనక ఉంటే ఆ ఇంట ఆ గర్భాన్న పుట్టబోయే పిల్లవాడు అసామాన్యమయిన మహాశక్తి అవతార మూర్తిగా జన్మిస్తారని పండితులు సెలవిచ్చినారట. కాన్పు అవగానే ఈ బాలుడిని

క్రింద పడుకోపెట్టినప్పుడు ఒక నాగుపాము వచ్చి పడగవిప్పి చంటి పిల్లవాడి ముఖాన్ని చూచి దర్శించుకోవడం, తదుపరి వైతొలగడం చూచి ఈశ్వరమ్మగారు చుట్టూ ఉన్న ఆడవారంతా ఆశ్చర్యపోయి బిడ్డకి ఏ హాని జరగనందులకు సంతసిల్లి గట్టిగా ఊపిరి పీల్చు కున్నారు . ఇది ప్రప్రథమంగా బిడ్డ పుట్టగానే తల్లి కళ్ళారా చూసిన లీల ఇది. ఆమె గర్భధారణ చాలా విచిత్రంగా జరిగింది. ఒకనాడు ఆమె బావిలోనుండి నీళ్ళు తోడుతున్నప్పుడు ఆకాశంనుండి దివ్యకాంతులు వెదజల్లుతూ ఒక నీలలోహిత తేజోపుంజం గుండ్రంగా తిరుగుతూ ఆమె గర్భంలో ప్రవేశించింది. బాబా ఈ విషయాన్ని ఒక భక్తునకు స్వయంగా తల్లి చేత చెప్పించారు. బాబా తమ దివ్య సందేశంలోకూడా ఒకసారి తెలియజేసారు, తమ జన్మ ప్రసవమా లేక ప్రవేశమా అని అడిగిన దానికి సమాధానంగా.

ఈశ్వరమ్మ పెద్దలను, అత్తమామలను సేవిస్తూ ఉత్తమ గృహిణిగా పేరు సంపాదించుకున్నది. ఆమె ఏమీ చదువుకోకపోయినా ఆమెకు రామాయణ, భారత, భాగవత పురాణాలకు సంబంధించిన కథలు తెలుసు. దైవప్రీతి, పాపభీతి, సంఘనీతిని పాటించిన మహిళామ తల్లి. స్త్రీధర్మాలన్ని బాగా తెలుసున్న వ్యక్తి. తన బిడ్డ సామాన్య బాలుడు కాదని కాలక్రమేణా తెలుసుకున్నా ఆమె మాతృహృదయం ఆ దివ్యత్వాన్ని గుర్తించడానికి అడ్డుపడేది. సహజంగా పసిపిల్లలు పుట్టగానే ఏడుస్తారు. కాని ఈ బాలుడు మాత్రం పుట్టగానే ఏడవలేదు. తొమ్మిది నెలల వయసులో స్నానం చేయించి విభూతి కుంకుమలు పెట్టి ఉయ్యాలలో పడుకోపెట్టి ఈశ్వరమ్మ వంటింటిలోకి వెళ్ళగా పిల్లవాడు ఏడుపు వినిపించింది. ఆమె వచ్చి ఎత్తుకొని ఒడిలో పడుకోపెట్టుకునే సరికి ఏడుపు ఆపివేశాడు. ఆ క్షణంలో బాలుని చుట్టూ ఒక వింతకాంతుల తేజోవలయాన్ని ఆమె దర్శించి తన్మయురాలైనదట. ఒక అనిర్వచనీయమైన అనుభూతిని ప్రశాంతతను పొందింది. అత్తగారికి ఈ సంఘటన వివరించగా ఆమె ఆశ్చర్య చకితురాలైనది.

బాబా అందరి పిల్లల్లాగా అది కావాలి, ఇది కావాలి అని అడిగేవాడు కాదు. అలా కాకుండా మారాము చేస్తే బాగుంటుందని అనిపించేది

ఈశ్వరమ్మకు. అందరికి బట్టలు కొని తెచ్చినప్పుడు తల్లి 'నీకేది కావాలో తీసుకో బాబూ' అంటే 'నేనేమీ కోరను, అందరు తీసుకున్న తర్వాత మిగిలినది నాకు ఇస్తే తీసుకుంటాను' అని బాబా బదులు చెప్పేవారట (అలనాటి నుండి నేటివరకు అదే పద్ధతి స్వామి కొనసాగించారు. దివ్యత్వంలోని గొప్పతనానికి ఇదే నిదర్శనం). ఈ మాటలు విని ఆమె చాలా ఆశ్చర్యపడేది.

బాబా చిన్ననాడే చక్కగా పాడేవారట. ఆయన కొన్ని నాటకాలు వ్రాసినట్లు, నటించినట్లు వారి జీవితచరిత్ర వివరించింది. ఒక సందర్భంలో ఋష్యేంద్రమణి పాత్రధారి రాలేదని నాటక సమాజం వారు కంగారు పడుతున్నప్పుడు ఈ సత్యనారాయణ రాజు ఆ పాత్ర పోషించి అందరి మన్ననను పొందాడు. ఇవన్ని చూసి ఈశ్వరమ్మ అబ్బురపడేది. ఆమెకు ఒకవైపు ఈ బాలుని తెలివితేటలకి, ఇతర కళలలోని కుశలతకు మురిసిపోయినా, అది చూసి ఎవరైనా ఓర్వలేక అసూయతో కీడు తలపెడతారేమోనని ఆందోళన చెందేది. దిష్టి తియ్యడంవంటి ప్రక్రియలు చేస్తుండేది. తన బిడ్డని 'బ్రహ్మజ్ఞాని', 'బిడ్డలగురువు' అని అందరూ పిలుస్తుంటే ఆమెకు భయాందోళనలు కలిగేవి. స్కూలులో ఉపాధ్యాయుడు తన పిల్లవాడు రాజును అన్యాయంగా బెంచిమీద నిలబెట్టినందులకు కుర్చీనుండి లేవలేకపోయాడన్న సంగతి విని ఈశ్వరమ్మ ఇది తన కుమారుడి దివ్యలీలా నాటకానికి నాంది ఇది అని మనసులో అనిపించినా ఒక తల్లిగా అతనిని మందలించింది. ఈ వింత వింత లీలలు తన కుమారుడిని తననుండి దూరం చేస్తాయేమో అన్న భయం కలిగేది. అటు మాతృత్వానికి దివ్యత్వానికి జరుగుతున్న పోరు ఆమెను ఘర్షణకు గురి చేసేది. తేలుకాటుకు రాజు గురైన సందర్భం కూడా ఆమెను కలవర పెట్టింది. అతని వైఖరి మారిపోవడం, భూతవైద్యుడు చేసిన చికిత్స మౌనంగా భరించి, తన కళ్ళను తానే బాగు చేసుకోవడం ఆమెకు అర్థం కాలేదు. బాబా చాలా మితంగా తినేవారట. చిరుతిళ్ళు అవి ఏమి పెట్టినా తీసుకొనకపోవడం, మితంగా తినడం, చిన్న వయసులోనే గ్రంథాలలోని అనేక విశేషాలను పెద్దలకు చెప్పగలగడం వంటి విషయాలన్ని ఈశ్వరమ్మను కలవరపెట్టేవి.

బాబా అన్నగారైన శేషమరాజు గారింట్లో చదువు నిమిత్తం ఉన్నప్పుడు

ఆ కుటుంబానికి ఎంతో సహాయపడేవారు. నీళ్ళ కరవు వలన కావిడి మోసుకుని వెళ్ళి నీళ్ళు తెచ్చిపెట్టేవారు. ఈ పనులన్నీ బాబా చేయడం చూసి ఆ మాతృహృదయం తల్లడిల్లి పోయింది. తమ పిల్లవాడు రాజు గురించి అనేక కథనాలు విన్న ఈశ్వరమ్మ, వెంకమరాజులు అతనిని తమతో తీసుకుని వెళ్ళడానికి ఉరవకొండకు వచ్చారు. ఎక్సైజ్ ఇనస్పెక్టరు ఇంటి ఆవరణలో ఒక తోటలో బాబా కూర్చుని ఉన్నారు. తాను సాయిబాబానని ప్రకటన చేసిన దివ్యమైన సన్నివేశాన్ని తల్లిదండ్రులు చూసారు. తల్లిని చూసి 'మాయ వస్తున్నది' అనేసరికి ఈశ్వరమ్మకు దుఃఖం కట్టలు త్రెంచుకుంది. 'అమ్మను, నాతో మాట్లాడవా నాయనా' అని అర్థించింది. ఆ ప్రశ్నకు సత్యం శాంతం, గాంభీర్యం ప్రకటిస్తూ 'ఎవరికెవరు, ఇదంతామాయ' అని బదులిచ్చారు బాబా. ఆమె చేతితో పెట్టిన మూడు అన్నపు ముద్దలు తిని అబ్బా మాయ వీడింది, ఇక చాలు' అన్నారు బాబా. ఈ విధంగా భవబంధాలన్ని త్రెంచుకుంటున్న వేళ ఈశ్వరమ్మ సాయిని కోరింది ఒక్కటే పుట్టపర్తిలోనే ఉండి తన కార్యక్రమాలన్నీ కొనసాగించాలని. ఆమెకిచ్చిన మాట మేరకు స్వామి పుట్టపర్తిని తమ అవతార కార్యక్రమానికి రంగస్థలంగా ఎన్నుకున్నారు. 'ఈ వరమును తల్లికే కాక పుట్టపర్తి గ్రామానికి, ప్రపంచానికి ప్రసాదిస్తున్నాను' అని అభయమిచ్చారు. కుమారుడిని జీవితాంతం కళ్ళారా చూసుకొనవచ్చని ఈశ్వరమ్మ ఎంతో ఆనందపడింది. ఆ విధంగా బాబా ఉరవకొండలో అవతార ప్రకటన చేసి పుట్టపర్తి చేరుకున్నారు.

బాబా దివ్యత్వాన్ని అర్థం చేసుకునే దిశగా ఆమె అడుగులు వేస్తూ వచ్చింది. బాబా తల్లికి జ్ఞానోదయం కలగ జేయడానికి ప్రయత్నించేవారు. 'నేను నాభక్తుల కొరకు వచ్చాను' అని స్పష్టం చేసారు బాబా. ఈశ్వరమ్మను 'అమ్మా' అని పిలవకుండా 'గృహం అమ్మాయి' అని పిలవడం ఆమెను కొంత కలవరపెట్టి బాధ కలిగినా తదుపరి నెమ్మదిగా అలవాటు చేసుకున్నది. కాని తన పిల్లవాడిని 'స్వామీ' అని పిలవడానికి ఆమెకు కొంత సమయం పట్టింది. బాబా తన నివాసంగా కరణం సుబ్బమ్మ గారి ఇంటిని ఎన్నుకున్నప్పుడు ఆమె చాలా బాధ పడింది. కాని బాబాను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యం దృష్ట్యా దానికి సమాధాన పడింది. అనేకమంది పండితులు, వైద్యులు,

ఉన్నతాధికారులు వచ్చి అనేకానేక విషయాలు బాబాతో చర్చించి తృప్తిగా, ఆనందంగా తిరిగి వెళ్లడం చూసిన ఈశ్వరమ్మ 'నా బిడ్డ ఇన్ని విద్యలు ఎప్పుడు నేర్చినాడప్పా' అని ఆశ్చర్యపడేది. రోగాలు నయం చేయడం, విభూతితో స్వస్థత చేకూర్చడం చూసి ఆమె వెరగందేది. స్వామిని భక్తులు తమ గ్రామాలకి, పట్టణాలకి తీసుకుని వెళ్ళేవారు. గృహబాధ్యతల వలన ఈశ్వరమ్మకు బాబాతో వెళ్ళే అవకాశం తరచుగా కలిగేది కాదు. ఒక సందర్భంలో తన కుమార్తె వెంకమ్మ ద్వారా షిరిడి సాయి చరిత్ర విన్నది. 'షిర్డి బాబా ఎప్పుడూ ఎక్కడకీ వెళ్ళలేదట కదా! నీవు మాత్రం ఎందుకు వెళ్ళడం ? ఆయనే నీవని చెప్తున్నావు కదా!' అని బాబాని ప్రశ్నించింది. దానికి బాబా 'అందువలననే  ఇప్పుడు నేను వెళ్ళాలి' అని బదులిచ్చారు.

బాబా పేరు ప్రతిష్టలు విశ్వవ్యాప్తమవుతూ వచ్చాయి. రకరకాల వ్యక్తులు బాబా వద్దకు వస్తుంటే ఆమె మాతృహృదయం స్వామికి ఏమైనా కీడు తలపెడతారేమోనని తల్లడిల్లేది. అప్పటికే ఒక బ్రాహ్మణ స్త్రీ బాబాకు విషం కలిపిన గారె తినిపించడం, బాబా అది తిని మామూలుగా ఉండడం అన్న విషయం తెలిసింది. బాబా లీలలను ఆశ్చర్యంతో, భయంతోను తిలకించేది ఈశ్వరమ్మ. కొంతమంది మహిళలు సుశీలమ్మ, సుబ్బమ్మ, పెద్దబొట్టు ఆమెకు ధైర్యం చెప్పడం వలన ఊరట చెందేది. పల్లకీలో బాబాను అలంకరించి కూర్చుండబెట్టి ఊరేగించినప్పుడు ఎంతో ఆనందపడింది. తర్వాత దిష్టి తీసింది.

బాబా ఆఫ్రికా దేశ పర్యటనకు వెళ్తారన్న వార్త విని ఆమె కలవరంతో స్వామి ఉన్న చోటుకు పరిగెత్తుకుని వచ్చి, అక్కడ మనుషులను తినేవారున్నారని విన్నాను, అక్కడకు వెళ్ళవద్దని బ్రతిమాలింది బాబాని. దానికి స్వామి ' వాళ్ళందరిని సంస్కరించి వస్తాను. అయినా పేషంట్లు ఉన్నచోటికే కదా డాక్టర్లు వెళ్ళేది! ఏమీ భయపడవద్దు' అని ధైర్యం చెప్పారు ఆమెకి. అనేకమంది పెద్దలు కూడా వెడుతున్నారు కనుక భయం లేదులే అనుకుని స్థిమిత పడింది.

బయట ప్రపంచంలో ఏమి జరుగుతోందో ఈశ్వరమ్మ గారు చూడాలని స్వామి ఆమెను తనతో అనేక పుణ్యక్షేత్రాలకు తీసుకుని వెళ్ళారు. ఆ క్షేత్రాలలో ఆలయ అధికారులు సహితం దిగ్భ్రాంతి చెందే విధంగా స్వామి చూపిన అనేక

మహిమలని చూసి స్వామి నిజంగా భగవంతుడే అనే విశ్వాసం ఈశ్వరమ్మలో ధృవపడింది. స్వామి ఈశ్వరమ్మగారి చేత అనేక పుణ్యకార్యాలు చేయించారు.

కుల, మత, వ్యవస్థల భేదాలతో, అనేక మూఢ నమ్మకాలతో కూడిన ఒక గ్రామంలోని కుటుంబంలో పెరిగిన ఈశ్వరమ్మ సాయి కుటుంబ సభ్యులతో కలసి మెలసి మెలగడం నేర్చుకున్నది. ఉన్నది ఒకే మతం–అది ప్రేమ మతం, ఉన్నది ఒకే కులం– అది మానవకులం అన్న బాబా సూక్తులని అర్థం చేసుకోగల స్థితికి క్రమంగా ఆమె చేరుకో గలిగింది. స్వామి స్త్రీ జనోద్ధరణకు మహిళా కళాశాల స్థాపించడం, స్త్రీలకు కూడా పురుషులతోబాటు ఆత్మజ్ఞాన సముపార్జనకు సమాన అర్హతలున్నాయని ప్రబోధ చేయడం ఈశ్వరమ్మకు చాలా ఆనందం కలిగించింది. అనేకానేక ప్రాంతాల నుండి వచ్చినవారి బాధలు, సమస్యలు విని ఏమి ఫరవాలేదు, అంతా స్వామి చూసుకుంటాడు అని ఉపశమన వాక్యాలు పలకడమే కాకుండా కొన్ని సందర్భాలలో వాళ్ళ బాధలు తీర్చమని స్వామిని ప్రాధేయపడేది అని సాయి సాహిత్యం ద్వారా తెలుస్తున్నది. స్వామి ఆమెకు కొన్ని దివ్యానుభూతులని కూడా ప్రసాదించారు. 1972 సంవత్సరంలో స్వామి వేసవి శిబిరం ప్రారంభించిన పది రోజులకు ఆమెకు జ్వరం వచ్చింది. ఒక రోజు ఆమెను 'అమ్మాయీ ఎలా ఉంది నీకు' అని అడిగారు. తనకు శరీరం అంతా నెప్పులుగా ఉంది అని చెప్పింది. కళ్ళు తెరచి చూస్తే స్వామి ఆమెకు కోదండం ధరించిన శ్రీరామచంద్రమూర్తిగా దర్శనమిచ్చారు. ఆమె చేతులెత్తి నమస్కరించింది. పడుకుని ఉన్న ఆమె కూర్చునే లోపల యథాప్రకారం స్వామి రూపం కనిపించింది. విభూతి ప్రసాదం అనుగ్రహించి జ్వరం తగ్గిపోతుందని చెప్పి ఆశీర్వదించారు. ఈ అనుభూతినే ఆమె పెద్దబొట్టుగా పిలవబడే శ్రీమతి గాలి శారదాదేవి గారితో పంచుకుంది.

ఈశ్వరమ్మ బాబాను మూడు కోరికలు కోరింది. పుట్టపర్తి గ్రామంలో పిల్లలు చదువుకునేందుకు స్కూలు, ప్రజల సౌకర్యం కొరకు ఒక ఆసుపత్రి, త్రాగునీటి సదుపాయం ఆ గ్రామ ప్రజలకు అనుగ్రహించమని కోరింది. బాబా ఆమె కోరికలను అదే విధంగా నెరవేర్చారు. ఆమె నిస్వార్థమైన మనసుతో,నిష్కళంకమైన హృదయంతో లోకకళ్యాణం నిమిత్తం కోరినందువలన

బాబా అవి నెరవేర్చారు. అందుకే కాబోలు ఆమె 'విశ్వజనని' గా ప్రసిద్ధి గాంచింది. చివరగా 1972 సంవత్సరం మే 5వ తేదీన ఈశ్వరమ్మ గారిని ఏమైనా కోరికలుంటే చెప్పమని స్వామి అడిగారు. దానికి ఆమె 'నేను అన్ని క్షేత్రాలలోని దేవాలయాలను సందర్శించాను. అన్నింటికన్న పెద్ద దేవాలయంలో నున్న దేవుడిని దర్శించాను. ఇంక ఏ కోరిక లేదు నాకు' అని అన్నదట. కాని ఆమెకు ఒక చిన్న కోరిక ఉందని గ్రహించారు. తన మనుమరాలికి పుట్టినరోజుకు బహుమతి ఇవ్వాలని అమె అనుకున్నదట. సర్వాంతర్యామి యైన స్వామి ఆమెకు రూ. 500 ఇచ్చి ఏదైనా కొని పెట్టు మనవరాలికి అని కారు ఇచ్చి పంపించారట. మరుసటి రోజు మే 6వ తేదీన స్నానం చేసి స్వామి నామం తలచుకుంటూ తనువు చాలించిన ధన్యజీవి ఈశ్వరమ్మ.

దానము కాని యజ్ఞసముదాయము గాని
వైదిక సనాతనధర్మము కాని సత్యసంధానముగాని
నియమిత విధానము గాని మరి ఏదియైనను గాని
మాతృప్రేమకు సాటిరాదు విచారణ చేసి చూసినన్ (బాబా)

**(కీ॥శే॥ వి. రత్నమోహిని గారు రచించినది)**

## 'చందాదారులకు గమనిక'

**టెలిఫోను/మొబైలు ఫోను సౌకర్యం ఉన్న చందాదారులు వాటి నెంబర్లను శ్రీ కె.కె.గుప్త (9848414585) గారికి ఫోను చేసి తెలియ పరచవలసింది. లేఖ ద్వారా పి. రామగోపాలరావు, 3-5-1092/2, వెంకటేశ్వర కాలనీ, నారాయణగూడ, హైదరాబాదుకు పంపవలసింది. విశ్వసూక్తము సంచిక ఒకటి కన్న ఎక్కువ అందుతున్నట్లైతే ఆ విషయాన్ని శ్రీ కె.కె. గుప్తా గారికి తెలియ జేయవలసింది.**

# విశ్వహృదయార్చన

(గత సంచిక తరువాయి)

**మానవత్వంబన మనసు మాటయు క్రియయు**
**అన్ని ఒక్కటిగానే అతికి యుండు**
**మనసు వేరుగాను మాటయు క్రియయు**
**వేరువేరు యైన విలువ యేమి? (బాబా)**

స్వామి వచించినట్లుగానే సాయిమాట, సాయిబాట సాయి కార్య కలాపాలలో మమేకమవుతూ జీవితం గడపితే మోక్షము సిద్ధించడం తథ్యమన్న విషయాన్ని గ్రహించాలి.

**కులము వేఱటంచు గొడవలు చేయకు**
**కులము కన్న మనిషి గుణమే మిన్న;**
**కులము సాకు జూపి కుటిలత పెంచకు!**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥94)

సర్వమత సమ్మతమే సాయి మతము. కులాలు, మతాలు వేరైనా వృత్తి వ్యాపారములకు గాని, భగవత్సేవకు గాని తదితర ఉద్యోగాది క్రతువులకు గాని అడ్డుగోడలు కావు. విశ్వంజీ పలుమారులు పలు ఉపన్యాసాలలో అనేకానేక ఉదాహరణల ద్వారా కులమతాల్ని గురించి వివరించి చెప్పారు. ఒక వ్యక్తికి ఒంట్లో బావుండకపోతే, అకస్మాత్తుగా గుండెపోటు వస్తే వెంటనే ఒక ఏంబులెన్సు తెప్పించి నేరుగా హాస్పిటల్‌కు తీసుకొని పోతారు తప్ప, ఈ వ్యక్తికి వైద్యం చేసే డాక్టరు ఏ కులస్థుడు ఏ మతస్థుడు అని ఎవ్వరు ఆలోచించరు. ఆలోచించాల్సిన అవసరం కూడా లేదు. జబ్బుపడిన వ్యక్తికి కావలసినది వైద్యం గాని కులం ప్రసక్తి కాదు. ఆ డాక్టరు తన నైపుణ్యంతో ఆ వ్యక్తికి ఏది అవసరమో అది చేసి మందులు వ్రాసి యిచ్చి ఆప్యాయంగా ధైర్యం చెప్పి ఇంటికి పంపుతాడు. అందుచేత మానవత్వమనేది ఉన్నది గనుకే మానవుడు మూర్ఖంగా ప్రవర్తించకుండా వెంటనే కులాల ప్రస్తావన లేకుండా వృత్తిని బట్టి తోటి మనిషిని గౌరవిస్తూ, తన అవసరం ఇతరులకు కలిగినప్పుడు తాను మేలే చేస్తున్నాడు

గాని కీడు తలపెట్టడం లేదు. అందుచేతనే మానవత్వం మంట కలిసి పోయిందని భావించకుండా అందరిలోనున్న మంచిని గ్రహిస్తూ సహజీవనం సాగించినాడు.

ప్రతి మనిషి తన కులం గొప్పదని ఇతరుల కులాల్ని తక్కువ భావంతో చూడడం సరైన పద్ధతి కాదని హెచ్చరించుచున్నారు. ఏ కులంలో పుట్టినా గొప్ప గుణం కలిగి యుండడం ప్రధానం ఏ కులం వాడైనా, ఏ మతం వాడైనా అతడిలోనున్న గొప్ప గుణం వలన వికసించి యున్న మానవత్వం గొప్పది. మానవ కులానికి మించిన కులమేది లేదన్నారు స్వామి.

ఉన్నది ఒకడే దేవుడు – అతడు సర్వవ్యాపి
ఉన్నది ఒకటే కులం – అది మానవకులం
ఉన్నది ఒకటే మతం – అది ప్రేమ మతం
ఉన్నది ఒకటే భాష – అది హృదయ భాష
ఉన్నది ఒకటే ధర్మం – అది కర్తవ్యం

అన్నారు. కులం సాకుతో కుటిలత పెంచకుండా, మానవాళి యందున్న మంచితనం, మానవత్వం గ్రహించి ఏ కులం వారైనా, ఏ మతం వారైనా, అందరికీ ఒకే భగవంతుడు అని గ్రహియించి అందరూ ఆయన బిడ్డలేనన్న భావనతో, తోటి మానవుల్ని గౌరవిస్తూ ప్రేమిస్తూ సాధనా దిశవైపు పయనించాలే గాని మత కలహాలకు దారి తీసే విధంగా ప్రవర్తించరాదన్న విషయం తెలుస్తోంది. కులాలు, మతాలు అన్నీ ఆయన సృష్టించినవే గాబట్టి ఎవరు ఏ దేఁవుణ్ణి పూజించినా చివరకు చేరే గమ్యం ఒక్కటే నన్న విషయం గుర్తించి వర్తించాలి. ఈ విషయాన్నే పరమాత్మ భగవద్గీతలో ఈ విధంగా సెలవిచ్చాడు.

**శ్లో॥ చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగనః**
**తస్యకర్తార మపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్** (అ.4.శ్లో.13)

గుణములను బట్టి, కర్మలను బట్టి నాలుగు వర్ణముల వారిని నేను సృజించితిని. నేను వాటికి కర్తనైనను నన్ను అవ్యయునిగ, అకర్తునిగ గ్రహింపుము అని చెప్పాడు. చాతుర్వర్ణములు నా చేత నిర్మింపబడ్డాయి. అందుచేత మానవత్వంతో మనిషి మనిషిగా మెలగిన నాడు కుటుంబం, సమాజం, దేశం,

ప్రపంచం ప్రశాంతి నిలయాలుగా వెల్లివిరియాలన్నదే మహనీయుల ఉవాచ. ఒక వ్యక్తి సమాజం కాదు. ఒక వృక్షం వనం కాదు. అలాంటి వ్యక్తులెందరెందరో కూడి సమైక్యంగా మెలగుతూ కృషి సల్పిననాడు ప్రపంచం ప్రశాంతి నిలయంగా మారడానికి దోహదపడినట్లవుతుంది.

**వడుగు జేసుకొన్న వచ్చునా? బ్రాహ్మ్యంబు?**
**మంత్రసిద్ధి వలన మారు గాని**
**మంత్రశక్తి చేత మనిషి దైవమగును**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥93)

ఉపనయనమనే సంస్కారం ద్వారా బ్రహ్మచర్యాశ్రమం ప్రారంభ మవుతుంది. గాయత్రీ మంత్రోపదేశం చేయడం ముఖ్యాంశంగా ఈ సంస్కారము జరుపబడుతుంది. భౌతికంగా బ్రాహ్మణులకు, వైశ్యులకు, క్షత్రియులకు మాత్రమే ఈ ఉపనయన సంస్కారం జరిపించడమనే ఆచారము హిందూమతములో నున్నది. బ్రహ్మత్వం పొందడానికి కేవలం ఉపనయనం సాధనం కాదంటున్నారు విశ్వం.జీ. నిరంతరం బ్రహ్మభావంలో చరించే వారు బ్రాహ్మణులని చెప్పబడినది పరమాత్మ గీతలో చెప్పినట్లు అన్ని వర్ణముల వారిని తానే సృష్టించడం జరిగింది. గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించడమునే కీలకమైనదిగా భావన చేసి వటువుకు పురోహితులైన ఆచార్యుల సమక్షంలో వేద మంత్రోచ్ఛారణతో తండ్రి తనయుని చెవిలో గాయత్రీ మంత్రాన్ని నిర్ణీత ముహూర్త కాలానికి ఉపదేశించడం జరుగుతుంది. వటువు బ్రహ్మచర్య ఆశ్రమంలోనికి ప్రవేశిస్తున్న శుభసమయమది. కేవలం ఈ క్రతువు చేసుకొని గాయత్రీ మంత్రాన్ని జపించకుండా బ్రహ్మచర్య దీక్ష పాటించకుండా ఉంటే అట్టివారు బ్రాహ్మణులు కారన్న విషయం ఇక్కడ స్పష్టంగా చెప్పబడింది. ఎప్పుడైతే మహాశక్తివంతమైన గాయత్రీ మంత్రాన్ని త్రిసంధ్యలలో నియమనిష్ఠలతో జపిస్తారో దాని వలన మహాశక్తి వంతులౌతారని పెద్దలు చెబుతారు. గాయత్రీ మంత్ర జపం వలన సంప్రాప్తించిన ఆ మహాశక్తితో ఎంతటి కార్యాన్నైనా సాధించవచ్చునని, ఆరోగ్యం, ఐశ్వర్యం, విద్య మున్నగున వన్నీ ప్రసాదించేదే గాయత్రీ మంత్రమని బాబా చెప్తుంటారు. గాయత్రీ మంత్రాన్ని గురించి బాబా చెప్పిన విశేషాలు క్లుప్తంగా పరిశీలిద్దాము.

ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహిః ధియోయోన హః ప్రచోదయాత్ ॥

ఓం = "సూర్యదేవుని పవిత్రమైన మంగళకరమైన తేజస్సును ధ్యానించు చున్నాము. ఆ దివ్యమైన తేజస్సు మా బుద్ధిలో ప్రకాశవంతమైన భావనలు (సద్భావములు) ప్రవహింపజేయుగాక! ఈ గాయత్రీ మంత్రం సవితృ దేవునికి అంకితమైనటువంటిది. సవితృ సూర్యునకు ప్రతినిధి. సూర్యుడు ప్రపంచము నంతటికీ వెలుగు నిచ్చువాడు. భౌతిక ప్రపంచంలో చీకటి తొలగి (అజ్ఞానము) కాంతిని (జ్ఞానము) కోరి సూర్యునికి నమస్కరిస్తున్నాను. గాయత్రీ దేవతయైన సవితృడు సంపూర్ణ శక్తి మయమైన అనంత జ్ఞానమునకు ప్రతీక. ఇదే ప్రజ్ఞ. ఈ మహత్తరమైన శక్తి మూడు లోకములను సూర్య చంద్రులను అధిగమించి స్వవ్యాప్తియై మన మేధస్సును పదునుపెట్టి, ప్రేరేపించి మేల్కొల్పమని ప్రార్థన. మన బుద్ధులకు సరియైన చైతన్యాన్ని అందించి ప్రేరేపించగల దేంవుడు సవితు కాబట్టి ఆ దేవుని యొక్క శ్రేష్టమైన తేజస్సును మనము ఎల్లప్పుడు ధ్యానింతుముగాక! ( ఆపరమాత్ముడే మన బుద్ధులను నడిపించే సారథి) గాయత్రికి మూడు పేర్లు – గాయత్రి, సావిత్రి, సరస్వతి. ఈ మూడు పేర్లు ఈ మాత యొక్క మూడు అంశలకు ప్రతీకలు. ఈ మూడు అంశలు ప్రతి ప్రాణిలో నున్నవి. తెలివితేటలను అభివృద్ధి పరచునప్పుడు ఈమె గాయత్రి. ప్రాణములను రక్షించునప్పుడు ఈమె సావిత్రి. వాక్కును కాపాడునప్పుడు సరస్వతి. గాయత్రి, సావిత్రి, సరస్వతి, అను పేర్లతో ఆయా సమయములందు బుద్ధిని, ప్రాణమును, వాక్కును రక్షించేది గనుక, గాయత్రిని సర్వదేవతా స్వరూపిణి" అని అంటారు.

"గాయం తాం త్రాయతే ఇతి గాయత్రీ" ఎక్కడైతే ఈ మంత్రము జపింపబడునో అక్కడ గాయత్రి జపించువారిని కాపాడును. వారికి అమరత్వము సిద్ధింపజేస్తుంది. ఈ మంత్రము జపించు సాధకుణ్ణి ఆధ్యాత్మిక పురోగతి వైపుకు నడిపిస్తుంది. గాయత్రీ మంత్ర ద్రష్ట విశ్వామిత్ర మహర్షి. ఆ మహర్షియే శ్రీరామచంద్రునికి, ఆదిత్య హృదయమును ఉపదేశించుట ద్వారా సూర్యోపాసనలోని ఆంతర్యమును, మహిమను గ్రహింపజేసినాడు. విశ్వామిత్ర మహర్షి మన శరీరంలో 24 శక్తి కేంద్రాలున్నాయని కనుగొన్నాడు. ఆ 24

శక్తి కేంద్రాల గురించి ఆలోచన చేస్తుంటే 24 అక్షరాలు వచ్చాయి. ఈ 24 అక్షరాలను కలిపి క్రోడీకరించి మంత్రంగా ఉచ్ఛారణ చేశాడు. అప్పుడు సూర్యుడి నుండి తేజస్సు వచ్చి తనలో లీనమయినాడు తనని బ్రహ్మ స్వరూపంగా, బ్రహ్మతత్త్వంగా మార్చినట్లు తెలుసుకున్నాడు. విశ్వామిత్రుడు ఆ విధంగా గాయత్రీ మంత్రాన్ని వరదానం చేశాడు. ఈ విషయాన్ని విశ్వంజీ మహరాజ్ మనందరకు గురుదేవోభవ కార్యక్రమం ద్వారా ఎఱుక పరిచారు. పలుమార్లు తమ ఉపన్యాసాల్లో కూడా వచించినారు.

"గాయత్రీ ఛందసాంమాతః" గాయత్రి అనగా సర్వవేదములకు మాతృ స్వరూపిణి. "గాయ" అనగా జీవుడని అర్థము. జీవులను పోషించేది, ప్రాణము లను, రక్షించేది గాయత్రి అని కూడా దీనికి అర్థము. గాయత్రీ మంత్రము సర్వ దేవతా స్వరూపము. ఒక మతమునకు గాని, ఒక కులమునకు గాన, లింగస్థాయీ భేదములకు గాని సంబంధించిది కాదు (బాబా).

అందుచేతనే విశ్వంజీ "వడుగుచేసుకున్న వచ్చునా బ్రాహ్మ్యంబు" అన్నారు. ఏ కులం వారైనా, ఏ మతం వారైనా స్త్రీ, పురుష భేదం లేకుండా గాయత్రీ మంత్రాన్ని జపించవచ్చును. ఇది బాబా చెప్పిన విషయం. విశ్వయోగి చెప్పినది కూడా ఇంతే. గాయత్రీ మంత్ర జపం వలన శరీరంలో వచ్చే మార్పులు, దాని విశిష్టత, ఇత్యాది విషయాలన్నీ శ్రీ విశ్వంజీ తమ దివ్యోపన్యాసాలలో సెలవిచ్చారు. శరీరం శక్తివంతమై, రుగ్మతల బారి నుండి కాపాడబడుతోందనీ, మేధాశక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతాయని విశ్వంజీ వక్కాణించారు. "మంత్ర సిద్ధి చేత మనిషి దైవమగును అన్నారు విశ్వంజీ శరీరంలో నున్న నాడుల్ని శక్తివంతం చేసేది గాయత్రీ ఆ మంత్రోపాసన ద్వారా శక్తిని లాక్కొని శరీరాన్ని పవిత్రంగాను ఆరోగ్యవంతంగాను చేసుకొనవచ్చును. ప్రాణాలను సహితం కాపాడేది గాయత్రీ మంత్రం. విద్యార్థులకు మేధస్సును తెలివితేటలను పెంచేదీ గాయత్రీ మంత్రం" అన్నారు మరొక పాదంలో. "బ్రహ్మవిద్ బ్రహ్మైభవతి" – మంత్రం జపించగా జపించగా తానే మంత్రంగా దివ్యత్వంతో కూడుకొన్న వ్యక్తిగా దర్శనమిస్తాడు మానవుడు అని భావము. "మనిషిని మహాశక్తివంతంగా మారుస్తుంది" అన్నారు విశ్వంజీ ఇదే భావం క్రింద పద్యంలో చూద్దాం.

**యంత్రశక్తికన్నా మంత్ర శక్తి మిన్న**
**మంత్రశక్తి వలన మాయ తొలగు**
**నిశ్చలత్వముంది నిజము నెఱుగవచ్చు**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥62)

"మనన త్రాయితే ఇతి మంత్రః" అన్నారు. యంత్రశక్తి కన్న మంత్రశక్తి మిన్నయైనది అన్నారు విశ్వంజీ. మంత్రజపం చేయడం వలన యంత్రములు సహితం పనిచేస్తాయని భావము. ఇటువంటి అనుభవాలు భక్తులకు అవతారమూర్తుల యోగుల చరిత్రలలో కోకొల్లలు గా కనిపిస్తాయి. మంత్రం ఎంత ప్రభావితం చేస్తుంది అన్న విషయం అనుభవం ద్వారా తెలుసుకోవాలి. వాహనానికి ప్రయాణం చేస్తున్నప్పుడు ఏదైనా రిపేర్ వచ్చినా, పెట్రోలు లేకపోయినా మంత్రశక్తి వాటిని ముందుకు నడపించగలదు. ఇటువంటి అనుభవాలు భక్తుల జీవితాలలో జరిగినవి. భగవంతుడు లేదా సద్గురువులు, యోగులు ప్రసాదించిన మంత్రాలు మహాశక్తివంతమైనవి. శ్రీ విశ్వంజీ భక్తులకనుగ్రహించిన ఓం శ్రీ సాయిరాం గురుదేవదత్త మంత్రం మహాశక్తివంతమైనది. అనేకానేక విధాల భక్తులకు సహాయము నందించే మహామంత్ర రాజము ఓం శ్రీ సాయిరాం గురుదేవదత్త. ఆ మంత్రాన్ని గురువును భావన చేసుకుంటూ జపిస్తే అసాధ్యాలు సుసాధ్యాలవుతాయి. ఇది స్వానుభవములో జరిగినది. అలాగే 'సాయిరాం' అనుకోవడం వల్ల సాయిని భావన చేసుకొనడం వలన గాలిలో ప్రమాదంలో చిక్కుకుపోయిన విమానం సురక్షితంగా క్రిందకు దిగి భక్తుణ్ణి కాపాడిన సంఘటన సత్యసాయి చరిత్రలో కలదు.

అలాగే అమ్మ నామం భావనతో జపిస్తే విపత్తులు తొలగిన సంఘటన లనేకం. ఎవరి ఇష్ట దైవాన్ని వారు స్మరిస్తూ మంత్ర జపం చేస్తే దాని ముందు ఏ యంత్రాల శక్తి పని చెయ్యదు. యంత్రాలను కదిలించేది మంత్రమే. మనల్ని ఆవరించియున్న మాయ తొలగాలంటే మంత్ర జపమే సాధనంగా భావించి చేస్తూంటే మనల్ని గమ్యం చేరుస్తుంది. మానవాళిని శక్తివంతుల్ని చేసేది మంత్రమే. గురుముఖతః వచ్చిన మంత్రం మహాశక్తివంతమై మనిషిని

మహామనీషిగా మార్చి వేయగలదు.

మానవుణ్ణి పట్టి పీడిస్తున్న అజ్ఞానం తొలగి, జ్ఞానవంతుడిగా చేస్తూ మాయ తెరలను కూడా తొలగించి మహితాత్ముడుగా, మానవత్వం గల మహామనీషిగా నిశ్చలమైన మనస్సుతో నిబ్బరంగా నిలబడగలిగేలా చేసేదే మంత్రమే. అందుచేత ఆ శక్తి ముందు యంత్రశక్తి తక్కువదనే చెప్పవచ్చును. ఆ భావాన్నే విశ్వంజీ మహరాజ్ ఈ పద్యంలో విడమరచి చెప్పారు. చలించని తత్త్వం కలిగి ఉండడానికి తోడ్పడేది మంత్రమే. మానవుడు తాను ఈ ప్రపంచంలోనికి వచ్చి ఏం సాధించాలి? ఏ విధంగా నడచుకోవాలి? సాధన ఎలా చెయ్యాలి? అన్న నిజాన్ని ఎరిగేటట్లు చేస్తుందని విశ్వంజీ తెలియపరచారు. మాయ తొలగాలంటే సద్గురువును ఆశ్రయించి ఆయన ప్రసాదించిన మంత్రాన్ని లేదా నామాన్ని నిరంతరం జపిస్తూ సాధన చేయాలన్న భావం ఇక్కడ గోచరిస్తోంది. ఎన్నికోట్లు జపం చేశామన్నది కాదు ముఖ్యం. ఏకాగ్రతతో ఎంత చెయ్యగలిగితే అంత చేస్తే దానివలన మానవులు శక్తివంతులౌతారు. ఇది విశ్వగురువు ఉవాచ.

**విరుగని విషమునకు విఱుగుడు సాయియే**
**సాయినామమన్న శాంతి జల్లు**
**విషమునంత విఱచి విషయము నెఱిగించు**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥76)

సాయి నామ మాహాత్మ్యాన్ని మరొక్క మారు ఈ పద్యంలో విశ్వంజీ విశదీకరించారు. విషపూరితమైన ఆలోచనల్ని విఱచేది సాయి నామమే! సాయి నామం జపిస్తే శాంతి జల్లు కురుస్తుందట. మనస్సు ప్రశాంతంగా, నిశ్చలంగా, నిర్మలంగా నిలకడ చెంది ఉండాలంటే సాయి నామమే దీనికి తగిన దివ్యౌషధము. విషయవాసనలన్నీ దూరంగా తరిమివేసి అసలు విషయాన్ని ఎఱుకపరచేది సాయి నామమే. ఏ పద్ధతి అవలంబించినా, విరగని విషము – అనగా మనలో దాగియున్న విషపూరితమైన భావాలు, ఆలోచనలు, చెడు తలంపులు, కామక్రోధ లోభ మద మాత్సరములనే అరిషడ్వర్గాలు; ఇత్యాదిగా పేరుకొని పోయిన విషానికి విరుగుడు సాయి నామమేసుమా! అని

హెచ్చరిస్తున్నారు విశ్వంజీ. "శాంతిజల్లు" అన్నప్పుడు వానజల్లు కురిసినట్లుగానే శాంతి అనేది మనలోనే, మన హృదయాంతరాళాల్లోనే ఉండాలి. శాంత స్వభావము కలిగి నిర్మలమైన నిష్కళంకమైన మనస్సుతో ఆలోచిస్తే శాంత భావాలు కలుగుతాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ అశాంతికి గురికాకుండా శాంత భావంతో సాధించడం అలవరచుకోవాలి. ఆ విధంగా అలవరచుకుందుకు చేసే సాధనకు తోడు సాయినామమే! సాయిని నమ్ముకున్న వారికి సకలము సిద్ధిస్తాయన్న విషయాన్ని విశ్వంజీ ఈ పద్యంలో ఎఱుకపరచారు.

**కామవాసనమ్ము కాలు ద్రువ్వుచునుండి**
**కాల్చివేయు నిన్ను గడ్డివోలె**
**రాముడుండు చోట గాముడుండగలేదు**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥77)

(సశేషం)

***(కీ.శే. వి. రత్నమోహిని రచించిన విశ్వ హృదయార్చన నుండి సేకరణ)***

**గమనిక**

చందాదారులు తమ సభ్యత్వాన్ని సకాలంలో పునరుద్ధరించుకోవాలి. తమ రచనలను, చందాను (మనీ ఆర్డరు ద్వారా కాని, బేంకు చెక్కు ద్వారా కాని) ఈ దిగువ అడ్రసులకు **విశ్వమానవ సమైక్యతా సంసత్** (Viswamanava Samaikyata Samsat) 'విశ్వమందిరం', 3వ లైను, కృష్ణనగర్, గుంటూరు – 522 006. వెబ్‌సైట్ : www.viswaguru.com లేక పి. రామగోపాలరావు (P. Ramagopala Rao), 3-5-1092/2, వెంకటేశ్వర కాలనీ, నారాయణగుడ, హైదరాబాదు – 500 029, Phone : 040-24755674. పంపవలెను. K.K. Gupta, Cell : 9848414585, kkguptaca@gmail.com ఇదే అడ్రసుకు 'విశ్వసూక్తము' అందని చందా దారులు తెలుపవలెను.

# ఆత్మబంధువు

## విశ్వగురుచరితామృతం

(గత సంచిక తరువాయి)

తమ సాధనపై మాస్టరుగారికి అచంచలమైన విశ్వాసముండేది. గురువు మీద భక్తి, శ్రద్ధలు, స్వార్థరహితమైన ప్రవర్తన, నిష్కామ క్రియాచరణ, భూతదయ, ఆర్తులపై జాలి, మానవసేవ పట్ల అనురక్తి మొదలైన సద్గుణాలు ఆయనలో మూర్తీభవించి ఉండేవి. ప్రియంగా మాట్లాడడమే కాదు. ఎదుటివారి మనస్సునేమాత్రం నొవ్వకుండా మృదువుగా మాట్లాడటం వారికి ఉగ్గుబాలతో అలవడిన విద్య. తమకు నచ్చని విధంగానో, తమ మనస్సు నొచ్చే విధంగానో ఎవరైనా మాట్లాడుతుంటే మారు మాటాడక మౌనం వహించేవారు. ఆ మాటలు మోతాదు మించితే పల్లెత్తి, ఒకమాట కూడా ఎదురు మాట్లాడేవారు కాదు. ఎవరిని గురించీ చెడు మాట్లాడేవారు కాదు. అట్లా మాట్లాడితే వాళ్ళ కర్మను తీసుకొని అనుభవించవలసి వస్తుందని చెప్పేవారు. బీదాబిక్కీ అంటే వారికి తగని జాలి ఉండేది. చలికాలంలో - ఒకరోజు రాత్రి ఆయన రైలుపేట గదినుంచి ఇంటికి తిరిగి వస్తున్నారు. చలి విపరీతంగా ఉంది. మంచుకురుస్తూ, ఆ ఎముకలు కొరుక్కుతినే చలిలో, రోడ్డు ప్రక్కన బిచ్చగాడొకడు కూర్చొని చలికి వణికి పోతుండటం ఆయన కంటపడింది. ఛప్పున సైకిల్ దిగి, దగ్గరకెళ్ళారు. తాను వేసుకొన్న లాల్చీ, బనీను విప్పి, ఆ బిచ్చగాడికి తొడిగి, వీవు తట్టారు. ఆ బిచ్చగాడికి పోయిన ప్రాణం వచ్చినట్లైంది.

"ఆచరణలో పెట్టకుండా శుష్కవేదాంతాలు చెప్పటం శుద్ధ దండగ" అని భావించి, తాము ఆచరించేవాటిని ఇతరులను ఆచరించమని చెప్పేవారాయన. ప్రతి మాస శివరాత్రికి, పర్వదినాలు వచ్చినప్పుడు విధిగా ఏకాదశ రుద్రాభిషేకం తమ ఇంట్లో బ్రాహ్మడిచేత చేయించేవారు.

ఒకరోజు సాయంత్రం ఒక పాము జరజరా పాక్కుంటూ మాస్టరుగారు అద్దెకున్న పోర్షను ముందుకు వస్తున్నది. దాన్ని చూడంగానే వరలక్ష్మమ్మ గారికి

భయం వేసి, "విశ్వం -- పాము! -- పాము!" అని పెద్దగా కేకలు పెట్టింది. ఆ కేకలు విని వరలక్ష్మమ్మగారు బైటికి వచ్చి "వాడు పామును చంపడు - వేరే ఎవరినన్నా పిలుద్దాం" అంటున్నది. ఇంతలో మాస్టరుగారు బయటకు వచ్చి, ఆ పాముకేసి నిశ్చలంగా చూచారు. ఆ పాము మాస్టరుగారిని చూచి, ఛప్పున ఆగిపోయి, పడగ విప్పి ఆడటం మొదలు పెట్టింది. ఆట్లా రెండు మూడు నిముషాల సేపు అది ఆడి, తలను నేలకానించి, ఎట్లా వచ్చిందో అట్లా వెళ్లిపోయింది. మాస్టరుగారి ముందు ఆ పాము అట్లా ఆడటం అందరికీ ఆశ్చర్యం కలిగింది. దైవాంశ సంభూతులను దర్శించి పోవడానికి సర్పాలు రావటం పరిపాటి.

గురుమహారాజ్ మంత్రోపదేశం చేసిన ఐదేళ్ళకే మాస్టరుగారికి మంత్రసిద్ధి కలిగి, అద్భుత శక్తులు కలిగాయి. ఆయన చూపులో, పలుకులో, చేతి స్పర్శలో ఏదో హిప్నాటిజం లాంటి శక్తిఉండేది. ఎవరన్నా తలనొప్పిగా ఉందన్నా, జ్వరంగా ఉందన్నా విని, మాస్టరుగారు మెదలకుండా లోపలికి పోయి, ఒక గ్లాసెడు మంచినీళ్ళు తీసుకువచ్చి, త్రాగమని ఇచ్చేవారు. ఎంతో ఉపశమనం కలిగేది. ఇక ఆయన చేత్తో ఇచ్చిన విభూతి మహత్తు అంతా ఇంతా కాదు. ఆయన దగ్గర విభూతి తీసుకొని పోయిన వాళ్ళు, వేరే వాళ్ళ కిస్తే వాళ్ళ బాధలు కూడా మంత్రించినట్లు మాయమై పోతుండేవి.

ఒకరోజు విశ్వంజీ ధ్యానం చేసుకొంటున్న గదిలోకి వచ్చింది వరలక్ష్మమ్మ. మాస్టరుగారు తాము కూర్చున్న పీటమీద నుంచి అర్ధమీటరు ఎత్తున గాలిలో తేలుతూ ఆమెకు కనిపించారు. అదిచూచి ఆమె స్తబ్ధురాలైంది. ఆమె భర్తగారు ఆంజనేయులుగారు జపం చేసుకొంటున్నప్పుడు అట్లాగే పీఠం పైనుంచి గాలిలో తేలియాడే దృశ్యాలు లోగడ ఆమెకు చూచిన అనుభవం ఉంది.

మాస్టరుగారు ఆశించినట్లే వారి జీవితం, వారి జాతకం మారిపోయింది. ఆత్మద్రష్టలై, యోగిరాజ్‌గా మారబోయే అమృత ఘడియలు ఆసన్నమైనాయి. "శాంతి ప్రేమదాయి సత్యసాయి" అనే మకుటంతో "శాంతి ప్రేమదాయి" శతకాన్ని ముద్దులు మూట గట్టేటట్లు రసవత్తరంగా, రమణీయార్థ ప్రతిపాదకంగా

అవి రచించారు. ఆ శతకాన్ని చూచి అన్నగారైన విద్యాసాగర శర్మగారు విభ్రాంతి పడి "ఎంత గొప్పగా వ్రాసాడు! ఏ మాత్రం ఛందోజ్ఞానం లేనివాడు ఇంత మహత్తరంగా వ్రాసాడంటే ఇదంతా "శ్రీసాయిలీల" అనుకుంటున్నానని ఆశ్చర్యం వెలిబుచ్చారు.

1974వ సంవత్సరంలో గురుమహారాజ్ రెండవసారి జడ్చర్ల వచ్చినప్పుడు, వారినుండి దత్తమాలామంత్రాన్ని, దత్తాత్రేయ మానసిక పూజా విధినీ, కొన్ని అస్త్రాలను పరిగ్రహించి, గురుదేవుల ఆశీస్సులు పరిపూర్ణంగా పొంది, గుంటూరుకు తిరిగి వచ్చిన తర్వాత మాస్టరుగారి యోగసాధన ముఖ్యమైన మూడవ మలుపు తిరిగింది. ఈ సమయంలోనే మాస్టరుగారు తీవ్రాతితీవ్రంగా, అనేక నియమాలూ కఠోర దీక్షలూ పెట్టుకొని సాధన చేశారు. రైలుపేట మసీదు వీధిలో ఉన్న కుప్పా సత్యనారాయణశాస్త్రి గారింట్లో, ఒక పోర్షన్ అద్దెకు తీసుకొని తమ సాధన కొనసాగించారు.

ఉదయం స్నానం చేసి, తల్లిగారిచ్చిన అన్నం క్యారియర్ తీసుకొని, తొమ్మిది గంటలకల్లా రైలుపేట చేరుకొనేవారు. తిరిగి రాత్రి తొమ్మిది పది గంటలకు ఇంటికి వచ్చేవారు. అప్పుడాయన సైకిల్ తొక్కుతుండేవారు. అన్నం క్యారియర్, సైకిల్ రైలుపేట గదిలో పెట్టి, అక్కడికి దగ్గర్లోనే ఉన్న స్కూలుకు వెళ్ళేవారు. అక్కడ పని కాగానే తమ గదికి వచ్చేవారు. ఆ గదిలో కాసేపు పిల్లలకు పాఠాలు చెప్పేవారు. ఆ శిష్యులను సానబెట్టి విలువైన వజ్రాలుగా మార్చారు మాస్టరుగారు. ఆ శిష్యరత్నాలకు మాస్టరు గారంటే మనుష్య రూపంలో ఉన్న భగవంతుడే ననిపించేది. మాస్టరుగారు తమపై ఎంత ప్రేమ వర్షించి, ఎంత కట్టుదిట్టం చేసి, క్రమశిక్షణ నేర్పారో, ఎందరి బాధల్నీ, వ్యాధుల్నీ విభూతి తీర్థం ఇచ్చి పోగొట్టారో వాళ్ళు కథలు కథలుగా చెబుతూ ఆ విశేషాలు ఒక్కొక్కటి వర్ణించి చెబుతుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

మాస్టరు గారిచ్చే విభూతి తీర్థాలు గురించి అప్పటికే ఊళ్ళో బాగా ప్రచారమైంది. చాలామంది అర్థార్థులు, ఆర్తులు మాస్టరుగారి గదికి వస్తుండేవాళ్ళు. శ్రీయుతులు జమ్మలమడక మాధవరామశర్మ, కరుణశ్రీ, అమరేంద్ర, డాక్టరు ప్రసాదరాయ కులపతి మొదలైన కవిపండితులతో మాస్టరు

గారికి బాగా పరిచయ మేర్పడింది. అప్పటికే "శాంతిప్రేమదాయి", కొన్ని గేయాలు, పద్యాలు వ్రాసి ఉండటం వల్ల కవిగా కూడా వారికి కొంత ప్రఖ్యాతి వచ్చింది. తరచుగా కవితాగోష్ఠుల్లో పాల్గొంటుండేవారు. "అంతా ఒక్కటే" అనే పేరుతో ఆయన వ్రాసిన గేయాన్ని వారి సహాధ్యాపకుడు, ప్రముఖ సినీ రంగస్థల నటులు జయప్రకాశ్‌రెడ్డి గారు దర్శకత్వం వహించి, నృత్యరూపకంగా పలుచోట్ల బాలబాలికలచే ప్రదర్శింపజేశారు. ఆ ప్రదర్శనలకు బహుళ ప్రజాదరణ లభించింది.

శ్రీ జమ్మలమడక మాధవరామశర్మ గారు తమ జీవిత చరమదశలో, రెండవ కుమారుడైన భవభూతి గారింట్లో, గుంటూరు బ్రాడీపేటలో ఉంటూ ఉండేవారు. చివరికి మంచం మీద నుంచి లేవలేని స్థితి వచ్చింది. వ్రాసే శక్తి కోల్పోయారు. మాస్టరుగారిలో దినదినాభివృద్ధి చెందుతున్న ఆత్మశక్తిని కనుగొంటూ ఆయన మురిసి పోయేవారు. మొట్టమొదట మాస్టరుగారిని యోగిగా గుర్తించి, దత్తాత్రేయ స్వరూపంగా సంభావించిన పరమదార్శనికు లాయన. మాస్టరుగారంటే వారికున్న వాత్సల్యం క్రమంగా అభిమానంగా, గౌరవంగా, పూజ్య భావంగా పరిణామం చెంది, మాస్టరు గారంటే భక్తి ప్రపత్తులు ఆయన చరమ జీవితంలో కలిగాయి.

ఒకరోజు మాధవరామ శర్మగారు ఈశ్వరిని చూచి, కళ్ళనీళ్ళు పెట్టుకొని, "కూతుళ్ళ చేత, కోడళ్ళ చేత చేయించుకోవలసిన పని మీ చేత చేయించు కుంటున్నాను. నీవు నాకొక సాయం చేసి పెట్టాలి! రాత్రి స్వప్నంలో విశ్వం మాస్టరుగారు కనిపించి, ఆరుమీటర్ల ధవళవస్త్రం నాకు ప్రదానం చేశారు. నా అంత్యకాలం సమీపించిందనటానికి అది నిదర్శనం. కంచి కామకోటి పీఠాధిపతులు పెద్ద స్వామివారు నాకు శ్రీచక్రం, శంఖం చాలా కాలం క్రితం ప్రసాదించారు. ఏదో నా శక్తి కొద్ది ఇంతవరకూ వాటిని పూజ చేస్తూ వచ్చాను. ఇక వాటిని పూజించే ఓపిక లేదు. పూజారహితంగా అవి ఉండరాదు. నీ పూర్వ పుణ్య విశేషం చేత విశ్వం మాస్టరుగారి చరణసేవ లభించింది. ఆయన సామాన్యుడు కాదు. చిచ్ఛక్తి స్వరూపం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయన పాదాలు మీరు వదలి పెట్టకండి. నా కోర్కె మన్నించి వాటిని తీసుకుపోయి, నేనిమ్మన్నానని

మాస్టరుగారి కివ్వండి", అని శంఖం కల్పనకూ, శ్రీ చక్ర గర్భితమైన చందనపు గుళికను ఈశ్వరికి ఆయన ఇచ్చారు. ఆయన చందనపు గుళికను ఈశ్వరి చేతిలో పెడుతుంటే, అమితమైన వేడి ఆమె శరీరంలోకి పాకుతున్నట్లు చెయ్యి బరువెక్కినట్లు అనిపించింది.

వాటిని తీసుకొని వాళ్ళు వెంటనే రైలుపేటలోని మాస్టరుగారి దగ్గరికి వచ్చారు. గుమ్మం దగ్గర నిలబడ్డ వాళ్ళను "రా! ఈశ్వరీ! లోపలికి రండి!" అని స్వామీజీ ఆహ్వానించారు. వాళ్ళు "మాధవరామశర్మ గారిమ్మన్నా"రని శ్రీచక్రం, శంఖం మాస్టరుగారి కిచ్చారు. ఈశ్వరి చేతి నుండి శ్రీచక్రాన్ని అందుకొంటున్న సమయంలో మాస్టరిగారి ముఖం కందినట్లైంది. వొళ్ళంతా కుంకుమ పూసినట్లైంది. వెంటనే ఆయన ఆ శ్రీ చక్రం, శంఖం పీఠం మీద పెట్టి, గబగబా బావి దగ్గరకు పోయి, నీళ్ళు తోడుకొని బొక్కెన తర్వాత బొక్కెన తలపై నీళ్ళు కుమ్మరించుకోవటం మొదలు పెట్టారు. అట్లా ఎన్ని బొక్కెనలు పోసుకున్నారో! లెక్కలేదు. ఆ తర్వాత ఎఱ్ఱని ధోవతి కట్టుకొని, ఎఱ్ఱని ఉత్తరీయం కప్పుకొనివచ్చి, శ్రీ చక్రానికి పూజ చేసి హారతి ఇచ్చారు. పూజ పరి సమాప్తమైన తర్వాత గదిలో ఉన్నవాళ్ళందరినీ కలయ చూస్తూ "ఈ శ్రీ చక్రం చాలా మహిమ కలది. దీన్ని అందుకొంటుంటే, నా వొళ్ళు సలసలా కాలి పోవటం మొదలు పెట్టింది. ఆతాపోపశమనం కోసమే అన్ని బక్కెట్లు నీళ్ళు నేను పోసుకోవలసి వచ్చింది" అన్నారు మాస్టరుగారు. అప్పుడు చెప్పింది ఈశ్వరి. తన చెయ్యికూడా దాన్ని శర్మగారి చేతినుండి అందు కొంటున్నప్పుడు వేడెక్కిందనీ, బరువెక్కిందనీ.

మాస్టరుగారు "మీకు మరో విశేషం చెప్పాలి. ఒకరోజు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు మాధవరామ శర్మగారికి స్వప్నంలో కనిపిస్తే, ఆయన శ్రీచక్రం, శంఖం ఎవరికిమ్మంటారని స్వామి వారి నడిగారు. అప్పుడు స్వామివారు నాకివ్వమని చెబితే ఆయన నాకవి పంపించారు" అన్నారు.

శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి దివ్యశక్తులు చూచి, వారు సాక్షాత్తు శంకరులేనని భావించటమే గాని వారు దత్తావతారులన్న విషయం చాలా మందికి తెలియదు. సృష్టి స్థితి లయ కారకమైన దివ్యశక్తి (ఎలక్ట్రోమాగ్నటిక్ ఎనర్జీ) ఏదైతే ఉన్నదో అదే దత్తశక్తి సుస్థాపితమై, అణువణువుకూ శక్తిని

ప్రసాదిస్తున్న ఆ దత్తశక్తి అపారమైంది. అనిర్వచ నీయమైంది. తీవ్రాతి తీవ్రమైన సాధన చేత, శోధన చేత దాన్ని స్వంతం చేసుకోవడానికి ఎవరు ప్రయత్నిస్తే అది వారికి దగ్గరౌతుంది. కనుకనే దానికి దత్తశక్తి అనే పేరు వచ్చింది. ప్రతి వ్యక్తిలోను హృత్ శక్తిగా, చిత్ శక్తిగా, ఆత్మ శక్తిగా వెలుగొందుతూ ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగా భాసిల్లుతూ, విష్ణు, బ్రహ్మ, రుద్ర సమైక్య స్వరూపంగా మనిషిలో తేజరిల్లుతున్న దివ్యశక్తే దత్తశక్తి. ఆ శక్తితో సంబంధం పెట్టుకొని, ఆ శక్తిని తనలో జాగృతం చేసుకొన్న వ్యక్తి దత్త స్వరూపమే అవుతాడు. 'అత్రి' అన్నది సాధకుడికి సంకేతం. అత్రి అంటే మూడు లేనివాడు లేదా మూడు కానివాడు అని అర్థం. ఆధిభౌతికం, ఆధిదైవికం, ఆధ్యాత్మికం అనే తాపత్రయాలకూ, సత్త్వరజస్తమాలనే త్రిగుణాలకూ అతీతుడై బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంధిత్రయాన్ని (ఇవే త్రిపురాలు) భేదించు కొని అనసూయాతత్త్వాన్ని (అసూయలేని స్థితిని) మానసిక సహధర్మచారిణిగా జేసుకొన్న వ్యక్తికి ఆ విశ్వశక్తి దత్తమౌతుంది. విశ్వశక్తిని దత్తం చేసుకొన్న వాళ్ళంతా దత్తావతారు లేనన్న భావంతో చూస్తే కంచి పెద్ద స్వామివారూ, విశ్వయోగి ఇద్దరూ దత్తస్వరూపులే.

ఒకసారి ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ జి. రామారాయుడు గారి కుమారుడు శ్రీ రఘునాధరావు మదరాసులో పెయింట్ ఫ్యాక్టరీ పెట్టి, దాన్ని ప్రారంభించ వలసిందిగా మాస్టరుగారిని అభ్యర్ధించారు. ఆ ప్రార్థనను మన్నించి మాస్టరు గారు మద్రాసు వెళ్ళారు. అక్కడ మాస్టరు గారికి "కంచిలో పెద్ద స్వామి అస్వస్థులై ఉన్నా"రన్న విషయం తెలిసింది. వెంటనే రామారాయుడు గారిని మరికొంత మందిని వెంటబెట్టుకొని ఆయన హుటా హుటిని కంచికి వెళ్లారు. "గుంటూరు నుండి 'విశ్వయోగి' మీ దర్శనానికి వచ్చా"రని శిష్యులు చెప్పగానే, అంత అస్వస్థతలోనున్న స్వామివారు చివుక్కున చేతులు జోడించారు. ఆ జగద్గురువులు, ఆ అపర శంకరాచార్యులు, ఆ దత్తావతారులు మాస్టరు గారిపై చూపిస్తున్న ప్రేమాతిశయంతో కూడిన ఆ ఆదరాభిమానాన్ని అక్కడ ఉన్న వాళ్ళంతా చూచి ఆశ్చర్యపోయారు. మాస్టరుగారిని చూస్తూ, ఆయన ఆనందంతో పరవశిస్తుంటే మాస్టరు గారు ఆయన ముందు సాగిలపడి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీ స్వామివారు మాస్టరు గారికి నూతన వస్త్రాలు

బహూకరించారు.

మాస్టరు గారంటే చిన్న స్వామికి అంత ఆత్మీయతా భావం ఉంది కాబట్టే మాస్టరు గారి 47వ జన్మదినోత్సవం నాడు తెల్లవారగట్లే తమకెన్ని పనులున్నా వాటిని పక్కనబెట్టి, మాస్టరు గారి దగ్గరకు వచ్చి, శుభాకాంక్ష లందజేసి వెళ్లారు.

1985 నవంబరులో మాస్టరుగారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 60వ జన్మదినోత్సవ వేడుకలు సందర్శించాలనే కుతూహలంతో పుట్టపర్తి వెళ్ళారు. అక్కడ వారి పెద్ద మేనల్లుడు శ్రీ పెళ్ళూరి ఆంజనేయులు బాబాగారి హైస్కూల్లో హెడ్‌మాస్టరుగా ఉంటున్నారు వాళ్ళ ఇంట్లో దిగారు. బాబా వారి జన్మదినోత్సవం నాడు ఉబుసుపోక వారు ఆ ఇంటి డాబామీదకు వెళ్ళి, కాసేపు అటూ ఇటూ తిరిగారు. డాబా పిట్టగోడ మీద పెట్టిన పూలకుండీ వారి కంటబడింది. అది అక్కడ అట్లాగే ఉంటే జారి, ఎవరి నెత్తిమీదనైనా పడుతుందేమో? నని దాన్ని పట్టుకొని క్రిందకు దించబోతున్నారు. అంతలో దాని అంచు ఊడి, ఆ పూలకుండి మాస్టరు గారి కుడికాలు మీద పడింది. బొటన వ్రేలు చితికి నెత్తురు కాలువ గట్టింది. ఆ గాయానికి కట్టు కట్టించుకొని, దాదాపు పదిహేను రోజులు మాస్టరు గారు కాలు కదల్చలేక చాలా బాధ పడ్డారు. ప్రశాంతి నిలయానికి పోయి కార్యక్రమాలు చూడాలంటే ఇద్దరు ముగ్గురు ఆయన్ను పట్టుకొని, తీసుకొని పోవలసి వచ్చేది. ఆ దెబ్బ వలన వారి కుడికాలి బొటన వ్రేలులోనున్న సుషమ్నానాడికి చలనం కలిగి, అద్భుతమైన రీతిలో కుండలిని జాగృతమైంది. “అది జీవితం మలుపు తిరిగిన శుభ ముహూర్తం” అంటారు మాస్టరుగారు.

మరోసారి వారు “అమ్మ” దగ్గరకు జిల్లెళ్ళమూడి వెళ్ళారు. వారిని చూచి అమ్మ పొంగిపోయి, చేతులు జాపి “అమ్మ దగ్గరికి ఎంత కాలానికి వచ్చావ్ నాన్నా! ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందా అమ్మ? రా!” అంటూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకొంది. ఆ అనసూయమాత వొళ్ళో ఈ దత్తమూర్తి పసిపాపలా వొదిగిపోయారు. అన్నం కలిపి, ముద్దలు చేసి, నోట్లో పెట్టి ఒక్కొక్కటీ అమ్మ

తినిపించసాగింది. ఆ అనురాగ సుధాలహరిలో మునిగి తేలుతున్న మాస్టరు గారి గొంతు సడలింది. జీర తెగింది. రాగం వెలువడింది. ఆ రాగం అకార, ఉకార సంయుక్తమైన "అను"రాగంగా అమృతాన్ని కురిపించింది. అమ్మ మాస్టరు గారికి తినిపించింది అన్నపు ముద్దలుకావు. జ్ఞాన కళికలు. సత్యం, శివం, సుందరమైన ఆ కబళత్రయ భక్షణంతో మాస్టరు గారిలో గ్రంథిత్రయ భేదనం జరిగింది. చిచ్ఛక్తి ప్రాదుర్భవించింది. ఆత్మ సాక్షాత్కారమైంది. ఆనాడు తమలో కలిగిన ఆ ఆత్మ సాక్షాత్కారానుభూతికి అద్దంపడుతూ 'అనురాగలహరి'ని వారు ప్రవహింప జేశారు. అమ్మ మూడు ముద్దలు తినిపించినదానికి గుర్తుగా, 'హృదయేశ్వరి'ని రూపొందించారు. హృదయాంతర్గతమైన దివ్యశక్తి యొక్క అమృతస్పర్శతో తన్మయమైన మనస్సు, దివ్యకవితావేశంతో ఎట్లా గంతులు వేస్తుందో? ఆత్మసాక్షాత్కారానుభూతి ఎంతటి ఆనంద పారవశ్యాన్ని కలిగిస్తుందో తెలుసుకోవాలంటే ఆ కావ్యాన్ని మనం తప్పక చదవాల్సిందే. ఆ గ్రంథంలోని మరో విశేషమేమిటంటే – అందులో మాస్టరు గారు మంత్రద్రష్టలై రూపొందించిన "అనురాగ చక్రం" ఉన్నది. (సశేషం)

**(కీ॥శే॥ కె.నరసింహ, ఐ.పి.ఎస్. రిటైర్డ్ గారు సంకలనం చేసిన 'ఆత్మబంధువు' నుండి సేకరణ)**

**గురూపదేశములు**

తేనెటీగ, జోరీగ అని రెండు రకముల ఈగలు కలవు. తేనెటీగ తేనెను మాత్రము గ్రోలును. జోరీగ తేనెను పీల్చుటయే కాక దానికి పసందైనప్పుడెల్ల అంతకంటే ఎక్కువ తమకముతో రసి కారుచునుండు పుండుమీద వ్రాలును. మనుషుల విషయము కూడ ఇట్టిదే. భగవద్భక్తులు భగవంతుని గూర్చియే కాని తదితర విషయములను గురించి మాటలాడ జాలరు. ఇక సంసార మోహితులు కామినీ కాంచనముల గూర్చిన సుద్దులు చెవిని బడగనే తామది వరకు వినుచుండిన భగవద్గోష్ఠిని విడిచి తటాలున ఆ సంభాషములోకి దిగుదురు.

**– శ్రీ రామకృష్ణ పరమహంస**

# గీతమంజరి

తే. బ్రదికియుండి నీడలనిచ్చి పండ్లనిచ్చి
పూవు లిచ్చి యాకుల నిచ్చి ప్రోచు జనులఁ
జచ్చి యింధనమై మేలు చాలఁ జేయుఁ
జెప్పఁ దరమౌనె వృక్షంబు చేయు హితము.

సహజముగ నుండవలెఁ గాని జన్మముననె
మధ్యకాలంబునను రాదు మంచిగుణము
మల్లియకు జన్మమునతోనె మంచితావి
పొడమెనేగాని నడుమను బుట్టెనొక్కొ.

కఠినచిత్తు గ్రృహవంతుఁగా నొనర్పఁ
జాలి గలవాని నిర్దయు పలువఁ దరమె
తీపియగునె యెన్నఁటికైన వేపఁకాయ
చేఁదుగాఁజేయ శక్యంబె చెఱకుకట్ట.

దుష్టసహవాసమునఁ జేసి శిష్టు డైన
నామరూపముల్ లేక వినాశమొందు
మంచినీ రిచ్చి మనుజుల మనుచునదులు
అబ్ధిఁ జేరి యనామధేయములు గావె.

**(కీ॥శే॥ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రచించిన గీతమంజరి నుండి సేకరణ)**